
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 6 ఆగస్టు 2025




ఇల్లు కడతారా?
డబ్బులు వెనక్కి కట్టేస్తారా?


మదనపల్లి మండలం నిమ్మనపల్లి రోడ్డులోని బసినికొండ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం స్థితి



కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల గృహాలు పూర్తయ్యాయి. ఈనెలాఖరు లోగా మరో 50 వేలు పూర్తి చేస్తే సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయిస్తామంటూ చెబుతోంది. 'లబ్ధిదారులకు రెండువారాలు గడువు ఇవ్వండి. ఆలోగా ఇంటి స్టేజీని అప్‌డేట్ చేయమనండి. లేకుంటే అడ్వాన్సుగా, అదనంగా తీసుకున్న డబ్బును ప్రభుత్వానికి వెనక్కి కట్టేయమనండి. తర్వాత ఇంటి నిర్మాణం చేపడితే, యథావిధిగా స్టేజీని బట్టి బిల్లు చెల్లిస్తాం' అంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలోని వర్క్ ఇన్‌స్పెక్టర్, ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు డీఈ, ఈఈలు సమావేశాలు, సమీక్షలు, టెలీ కాన్ఫరెన్స్‌తో దిశానిర్దేశం చేస్తున్నారు. ఇందులో భాగంగా గృహ నిర్మాణశాఖ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి నోటీసులు జారీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

- అడ్వాన్సు సొమ్ముపై హౌసింగ్ దృష్టి
- కాగ్ నివేదికతో రికవరీకి ప్రభుత్వం ఆదేశం
- ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించేందుకు అధికారుల తంటాలు


మదనపల్లి మండలం పోతబోలులోని జగనన్న లేఅవుట్‌లో చాలా ఇళ్లు పునాదులకే పరిమితమైన దృశ్యం

మదనపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 'అడ్వాన్సులు, అదనపు సొమ్ములు ఇచ్చి ఏళ్లయింది. అయినా గృహ నిర్మాణాల్లో పురోగతి లేదు. ఆ డబ్బులు ఇచ్చిందే నిర్మాణంలోని ఇంటి స్టేజీని అప్‌డేట్ చేయడానికి. కానీ చాలామంది లబ్ధిదారులు ఆ పని చేయడం లేదు. ముందుండీ మీరు ఉన్న స్టేజీని దాటించి పూర్తి చేయించాల్సిన బాధ్యత మీదే' అంటూ ప్రభుత్వం హౌసింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అంతే కాదు.. క్షేత్రస్థాయిలో వర్క్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఈఈ వరకూ రోజువారీ లక్ష్యాలు విధించింది. ఇన్నాళ్లూ ఆషాఢం, అధికమాసం అంటూ కారణాలు చెబుతూ వచ్చారు. ఇప్పుడు శ్రావణమాసం మొదలైంది. రోజులు కూడా బాగానే ఉన్నాయి. ఇంకెందుకు ఆలస్యం.. పనులు చేయించండి అంటూ గృహ నిర్మాణశాఖ మంత్రి నుంచి గృహ నిర్మాణశాఖ ఎండీ వరకూ రోజువారీ సమీక్షలు, సమావేశాలు, వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు.

'ప్రస్తుతం అమలులో ఉన్న ఇళ్లన్నీ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినవే. కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు పూర్తి సబ్సిడీ ఇస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద రూ.30 వేలు, పట్టణ ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేలు ఇచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తోంది. అయితే లబ్ధిదారుడు నిర్మించిన స్టేజీని బట్టి బిల్లులు చెల్లించినా అదనంగా ఇచ్చేశారని, కానీ క్షేత్రస్థాయిలో ఇంటి నిర్మాణాలు జరగలేదని గుర్తించిన కాగ్ ఆ మేరకు నివేదిక ఇచ్చినట్లు చెబుతున్నారు. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అప్పటి వైసీపీ ప్రభుత్వంలోనూ గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతుండటంతో స్టేజీని బట్టి పునాది పూర్తి చేసిన వారికి గోడల నిర్మాణానికి రూ.20 వేలు, గోడలు పూర్తి చేసిన వారికి మోల్డింగ్ వేయడానికి రూ.10 వేలు అడ్వాన్సుగా ఇచ్చింది. అలాగే స్వయం సహాయక సంఘాల్లో రూ.30 వేలు రుణంగా కూడా ఇప్పించారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గృహనిర్మాణాలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా 2005 నుంచి నుంచి 2024 వరకూ వివిధ పథకాల్లో ఇళ్లు మంజూరై వివిధ స్టేజీల్లో ఉన్నట్లు గుర్తించారు. ఇందులో ఇంటి యూనిట్ విలువతో ప్రమేయం లేకుండా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు కూటమి ప్రభుత్వం అదనపు సాయాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ అదనపు సాయాన్ని 2025 మార్చి 21న అడ్వాన్సుగా ఆయా లబ్ధిదారుల ఖాతాకు జమ చేసింది. అదే నెలలో వరుసగా ఉగాది, రంజాన్ పండుగలు రావడంతో పండుగ చేసుకో అన్నట్లు అయిపోయింది.

అప్‌డేట్ చేయని వారికి నోటీసులు

అయితే 4,646 మంది లబ్ధిదారులు ఇంకా ఇంటి నిర్మాణ స్టేజీని అప్‌డేట్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం వారికే నోటీసులు జారీ చేస్తున్నారు. స్టేజీని అప్‌డేట్ చేయకుంటే అడ్వాన్సు డబ్బులు తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని రికవరీకి సన్నాహాలు చేస్తున్నారు. అలాగే 2022 మార్చిలోనూ ఇదే తరహాలో కేంద్రం ప్రభుత్వం రూ.20 వేలు అడ్వాన్సు ప్రకటించి స్టేజీని బట్టి రూ.10 వేలు, రూ.20 వేలు లబ్ధిదారుల ఖాతాకు జమ చేశారు. అయితే చాలామంది లబ్ధిదారులు ఆ సొమ్ములను ఇంటి నిర్మాణానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించారు. ప్రస్తుతం వారి నుంచి స్టేజీ కన్వర్షన్ చేయించడం తలనొప్పిగా మారిందని అటు గృహ నిర్మాణ శాఖ, ఇటు సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు.

రూ.11.42 కోట్లు జమ

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీలతో పాటు 30 మండలాల్లో 8,238 మంది హౌసింగ్ పథకంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి రూ.12.15 కోట్లు చెల్లించేలా నిర్ణయించింది. అయితే వీరిలో వివిధ కారణాలతో 485 మంది లబ్ధిదారులకు రూ.73,17 లక్షలు పెండింగ్‌లో ఉండగా, మిగిలిన 7,753 మందికి సంబంధించి రూ.11.42 కోట్లు జమ చేశారు. జీఎస్‌డబ్ల్యూ సర్వీసులోని వివరాల ప్రకారం లబ్ధిదారుడి కులాన్ని గుర్తించి నిర్దీత సొమ్మును జమ చేశారు. ఇందులో గోడలు, మోల్డింగ్ పూర్తి చేసిన వారికి రూ.30 వేలు, పునాది పూర్తి చేసిన స్టేజీకి రూ.15 వేలు, నిర్మాణం పూర్తియిన ఇంటికి రూ.40 వేలు లబ్ధిదారుడి ఖాతాకు జమ అయింది. ఒక స్టేజీ పూర్తి చేసిన వారికి రూ.15 వేలు పడితే, పూర్తయిన ఇంటికి మొత్తం రూ.40 వేలు పడింది.

హుండీ ఆదాయం రూ.10.27 లక్షలు


హుండీని లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మి రెడ్డెమ్మ హుండీని దేవదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. ఇందులో భాగంగా నాలుగు నెలలకు అమ్మవారికి హుండీ ద్వారా రూ.10,27,285 నగదు, 44 గ్రాముల బంగారం, 107 గ్రాముల వెండి వచ్చినట్లు దేవదాయశాఖ అధికారి శశికుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, ఆలయ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్‌విండో సీఈఓకు అవార్డు


మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న సొసైటీ సీఈఓ కరుణాకర్‌రెడ్డి

మదనపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సింగిల్‌విండో) సీఈఓ పి.కరుణాకర్‌రెడ్డికి బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు దక్కింది. సహకార సొసైటీలో 2024-25 ఏడాదికి సంబంధించి రైతులకు ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవకాశం దక్కింది. మంగళవారం విజయవాడలో జరిగిన ప్రత్యేక సమావేశంలో సహకారశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు ద్వారా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. సింగిల్‌విండో రెండేళ్లలో ఎక్కడా లేని విధంగా రూ.11 కోట్లు బంగారు రుణాలు ఇచ్చి రికార్డు సృష్టించారు. ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ సెంటర్‌కు ఈ సొసైటీని కేంద్రం ఎంపిక చేసింది. ఇందులో భాగంగా ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల విక్రయ వ్యాపారం చేపట్టనున్నారు. రుణాల రికవరీలోనూ సొసైటీ ప్రథమ స్థానంలో నిలవడంతో సీఈఓకు ఈ అవకాశం దక్కింది. ఈ సందర్భంగా సహకార శాఖ ఉద్యోగులు, సిబ్బంది కరుణాకర్‌రెడ్డిని అభినందించారు.

పీ4 అమలుకు ప్రభుత్వం నిర్ణయం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పీ4 అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఈ నెల 19 నుంచి ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మెరుగైన తోడ్పాటు ఇచ్చేందుకు ఉద్యమ స్ఫూర్తితో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ4(ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమంపై మంత్రులు, కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో సీఎం చంద్రబాబునాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి కలెక్టర్ శ్రీధర్‌తో పాటు, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, సీపీవో వెంకట్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లేందుకు పీ4 కార్యక్రమాన్ని వినూత్నంగా రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో మార్గదర్శులుగా నమోదైన వారు బంగారు కుటుంబాల అవసరాల మేరకు చేయూతను ఇవ్వడం ద్వారా వారు జీవితంలో ఇంకా ముందుకు రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా 250 మంది బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వడానికి తాను కూడా మార్గదర్శిగా నమోదయ్యానన్నారు. ప్రస్తుత ప్రపంచంలో తలసరి ఆదాయంలో తెలుగు వారు ప్రథమంగా ఉన్నారని సీఎం పేర్కొన్నారు. పీ4 అమలుకు మార్గదర్శకాలను, విధి విధానాలపై ఒక బుక్లెట్ రూపొందించినట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేది నాటికి పీ4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా అనుసంధానం చేయడం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో తీసుకోవాల్సిన కార్యచరణపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జిల్లాలో ఈ నెల 19 నుంచి పీ4 అమలును ఒక ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం బంగారు కుటుంబాలుగా నమోదైన వారికి చేయూతను ఇవ్వడం కోసం ఆగస్టు 15 లోగా మార్గదర్శకుల నమోదు పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడంతో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా వలంటీర్‌గానే జరగాలన్నారు.

ముగ్గురు ప్రభుత్వ ఏజీపీలకు ఉద్వాసన

వివరాలు 6లో...

కల్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధం



వివరాలు 7లో...

ఉపాధి పనులా.. ఛ్చే..!



- కూలీలకు అందని బిల్లులు
- పనులున్నా.. ఆసక్తి చూపని కూలీలు

వివరాలు 6లో...

కానిస్టేబుళ్ల శిక్షణకు సన్నాహాలు


శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు. అనంతరం డీటీసీ చుట్టు పక్కల ఉన్న పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, కిచెన్, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను పోలీసు అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే డీటీసీలో మరమ్మతులు పనులు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. క్లాస్ రూమ్స్, రన్నింగ్ ట్రాక్, పరేడ్ గ్రౌండ్స్, డ్రిల్ ఏరియాను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎస్పీ వెంట డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, డీటీసీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు

బరిలో 22 మంది

- పులివెందులకు 11, ఒంటిమిట్టకు 11 మంది పోటీ
- పులివెందులపైనే అందరి ఫోకస్
- పోటాపోటీగా ప్రచారాలు
- ప్రశాంత ఎన్నికల కోసం కలెక్టర్, ఎస్పీ గురి
- డ్రోన్ కెమెరాలతో నిఘా



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 12న జరగనున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. పులివెందుల నుంచి 11 మంది పోటీ చేస్తుండగా ఒంటిమిట్ట నుంచి కూడా 11 మందే బరిలో ఉన్నారు. పులివెందుల టీడీపీ అభ్యర్థిగా మారెడ్డి లతారెడ్డి, వైసీపీ నుంచి తుమ్మల హేమంత్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మొయిళ్ల శివకళ్యాణ్‌రెడ్డి పోటీలో ఉన్నారు. మరో 8 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. ఇక ఒంటిమిట్ట నుంచి టీడీపీ అభ్యర్థిగా అద్దలూరు ముద్దుక్రిష్టారెడ్డి, వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నుంచి పూల విజయభాస్కర్, మరో 8 మంది ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. దీంతో రెండు స్థానాలకు కలిపి 22 మంది బరిలో ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ నెల 12న ఉప ఎన్నిక జరగనుంది. మంగళవారం పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ, వైసీపీ హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు.

అందరి దృష్టి పులివెందుల పైనే

పులివెందుల ఉప ఎన్నికపైనే అందరి దృష్టి ఉంది. సోషల్ మీడియాలో కూడా పులివెందుల ఎన్నికపై ఆరా తీస్తున్నారు. జగన్ సొంత గడ్డ కావడంతో, టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతారెడ్డి బరిలో ఉండటంతో ఈ స్థానానికి ప్రాధాన్యం పెరిగింది. ఎలాగైనా దీనిని గెలుచుకోవాలని టీడీపీ పట్టుదలగా ఉంది. మంగళవారం కూటమి ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇక వైసీపీ కూడా అవినాశ్‌రెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి కోసం ప్రచారం చేస్తున్నారు. గతంలో పులివెందులలో వైఎస్ కుటుంబాన్ని ఎదిరించి నామినేషన్ వేసేందుకు ఎవరూ సాహసించేవారు కాదు. జగన్ హయాంలో ఇతరులు నామినేషనే వేయలేని పరిస్థితి ఉండేది. అయితే కూటమి ప్రభుత్వంలో వైసీపీతో పాటు ఇతరులూ స్వేచ్ఛగా నామినేషన్లు వేశారు. టీడీపీలోకి వలసలు వస్తుండడంతో సహజంగానే వైసీపీ జీర్ణించుకోలేక పోతోంది. వైసీపీ బెదిరింపులకు పాల్పడుతోందని టీడీపీ ఆరోపిస్తుండగా.. టీడీపీ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. దీంతో ఇక్కడ ఎన్నిక ఉద్రిక్తత కలిగిస్తోంది.

ఒంటిమిట్టలో..

ఇక ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థిగా అద్దలూరు ముద్దుక్రిష్టారెడ్డిని ఖరారు చేశారు. వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో ఉన్నారు. టీడీపీ టికెట్ కోసం పలువురు పోటీ పడ్డారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పుంగనూరు ఇన్‌చార్జి చల్లాబాబు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహకకార్యదర్శి బి.హరిప్రసాద్ మంగళవారం మంటపంపల్లెలో ప్రచారం నిర్వహించారు. పలు కుటుంబాలను వైసీపీ నుంచి టీడీపీలోకి చేర్చుకున్నారు.

ప్రశాంత ఎన్నికలపై కలెక్టర్ సమీక్ష

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించేందుక కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాంగా మంగళవారం జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్‌కుమార్, జడ్పీ సీఈవో ఓబులమ్మతో కలసి ఆర్వోలు, వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్, మొబైల్ కనెక్టివిటీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, మ్యాన్‌పవర్, ట్రైనింగ్, సరిహద్దుల్లో చెక్‌పోస్టులు, తదితర అంశాలపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు.

డ్రోన్లతో నిఘా

ఉప ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రచారం సందర్భంగా ఎలాంటి గొడవ జరగకుండా ఉండేందుకు సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. పులివెందులలోని కనంపల్లె, నల్లపురెడ్డిపల్లె, ఆర్.తుమ్మపల్లెలో పోలీస్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఒంటిమిట్ట మండలంలో సమస్యాత్మక గ్రామాలైన చింతరాజుపల్లె, జాండ్లపల్లె, బోయపల్లె గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌తో పాటు కార్డన్ సెర్చ్ చేశారు. డ్రోన్లతో నిఘా ఉంచారు.

హత్య కేసులో నిందితురాలు అరెస్టు


నిందితురాలి అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సీఐ తల్లి స్వర్ణకుమారి హత్య కేసులో నిందితురాలిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మదనపల్లె మండలం, కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీ వాసి పేరం స్వర్ణకుమారి బంగారు నగలు కాజేసేందుకు కిడ్నాప్ చేసి, అనంతరం హత్య చేసి, తరువాత శ్మశానంలో పూడ్చి పెట్టిన కేసులో ఏ3 నిందితురాలు నీరుగట్టువారిపల్లె, మాయ బజారుకు చెందిన లేట్ శంకర భార్య రమాదేవి(55)ని అరెస్టు చేశామన్నారు. నిందితులు పథకం ప్రకారం 2024 సెప్టెంబరు 28న ముగ్గురు కలిసి టెంకాయనీళ్లలో మత్తుమాత్రలు వేసి అనంతరం సుత్తితో బాది హత్య చేశారని వివరించారు. ఇందులో వెంకటేష్, అనిల్ అనే ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కేసులో వెంకటేష్ తల్లి యల్లమ్మ ప్రమేయం ఉన్నట్లు తేలడంతో ఏ4 నిందితురాలిగా చేర్చామన్నారు. నిందితురాలు రమాదేవికి సెల్‌ఫోన్, తదితరాలు ఏమీ లేకపోవడం స్థానికులు సమాచారం ఇవ్వడంతో మదనపల్లె డీఎస్పీ పర్యవేక్షణలో మదనపల్లె తాలుకా సీఐ కళా వెంటకరమణ, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి మదనపల్లె-తిరుపతి మెయిన్‌రోడ్డు తట్టివారిపల్లె వినాయకస్వామి ఆలయం వద్ద ఆమెను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో దర్యాప్తు వేగవంతం చేసిన సీఐలు కళా వెంకటరమణ, చంద్రశేఖర్, పోలీసులు నరసింహులు, శంకర, రాఘవరెడ్డి, దొరబాబు, చలపతిలను డీఎస్పీ అభినందించారు.

ఉపాధి పనులా.. ప్చ్..!

● కూలీలకు అందని బిల్లులు ● పనులున్నా.. ఆసక్తి చూపని కూలీలు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ పనులు మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కు అన్న చందాన సాగుతున్నాయి. వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో కూలీలు ఉపాధి హామీ పనులపై అనాసక్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలో 7,799 జాబ్ కార్డులు ఉండగా, 14,034 మంది కూలీలు ఉన్నారు. 2024లో 2,05,559 మంది పని చేశారు. ప్రస్తుతం యాక్టివ్ జాబ్ కార్డులు 6,214 ఉండగా ఇందులో 10,636 మంది పని చేశారు. పని చేసిన కుటుంబాలు 4,493, ప్రభుత్వం రూ.5.34 కోట్లతో వివిధ గ్రామాల్లో రోడ్లు, సచివాలయాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.3.38 కోట్లు ఖర్చు చేశారు. ఇక మండలంలో ఉపాధిహామీ ద్వారా వివిధ గ్రామాల్లో ఫారంపాండ్‌లు 67, రైతుల పొలాల్లో బౌండరీ ట్రెంచ్‌లు 111, పండ్లతోటలు 179 మంది రైతులకు గానూ 470 ఎకరాల్లో పండ్ల తోటలు ఏర్పాటు చేశారు. కాలువల్లో పూడిక తీత 26 కాలువ పనులు చేపట్టారు. 2023-24 గృహనిర్మాణలకు 407 ఉపాధిహామీ ద్వారా రూ.87.15 లక్షలు బిల్లులను పెట్టారు. ఇక 574 జాబ్‌కార్డుకు 100రోజులు పని పూర్తి కాగా, ప్రస్తుతం 1163 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇక మండలంలో 67 ఫారంపాండ్లకు సంబంధించి రూ. 7.19 లక్షలు, 111 బౌండరీ ట్రెంచ్‌లకు రూ. 41.26 లక్షలు, 179 మంది రైతులు 470 ఎకరాల్లో పండ్లతోటలకు గాను రూ. 114.79 లక్షలు, 26 కాలువల్లో పూడిక తీత పనులకు రూ. 23.57 లక్షలు బకాయిలున్నట్లు ఉపాధి సిబ్బంది సమాచారం అందించారు.

రైతు పనుల పైనే ఆసక్తి..

గతంలో ఉపాధి పనులకు పెద్ద ఎత్తున కూలీలు హాజరయ్యేవారు. ప్రస్తుతం వారంతా వ్యవసాయ పనులకే ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ పనులకు వెళితే డబ్బులు ఎప్పటికప్పుడు చేతికి అందుతాయని భావిస్తున్నారు. ఉపాధి హామీ పనులకు వెళితే ఆ సొమ్ము ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి అందుకే వ్యవసాయ పనులకు వెళుతున్నట్లు ఉపాధి కూలీలు ఖరాఖండిగా చెబుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎక్కువ మంది కూలీలు పని చేసేలా చూడాలని, ప్రతి ఒక్కరికి పనులను కల్పించాలని ప్రభుత్వం అంటున్నా.. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదు.



రంగసముద్రం చెరువు పక్కన నీటి కుంట పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)



రాపూరివాండ్లపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు

అవగాహన కల్పించినా ప్రయోజనం శూన్యం...

ఉపాధి పనులపై ఎప్పటికప్పుడు కూలీలకు అవగాహన కల్పించినా ప్రయోజనం లేకుండా పోతోందని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం కనీస కూలి 307 రూపాయలు ఉన్నా కూలీలు మాత్రం చొరవ చూపడం లేదు. ఉన్నతాధికారులు ఓ వైపు కింది స్థాయి సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి చేస్తుండగా, వారు గ్రామాల్లో ఎన్ని సదస్సులు పెట్టినా కూలీలు మాత్రం ససేమిరా అంటున్నారు. గతంలో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండడం, కూలీల అవసరాలకు డబ్బులు సమకూరకుండా పోవడం నిరాసక్తతకు కారణంగా చెబుతున్నారు

వేధిస్తున్న సిబ్బంది కొరత

మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా, అన్ని ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నప్పుడు ఉపాధిహామీ పనులకు కూలీలు సక్రమంగా హాజరయ్యే వారు. ప్రస్తుతం ఏడు పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లు అవసరం కాగా, ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇక అభియోగాల నేపథ్యంలో ఏపీవో తిరుపాలప్పను పక్కన పెట్టారు. ఆయన స్థానంలో జేఈగా ఉన్న సుధాకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సిబ్బంది కొరత ఓ వైపు, కూలీలు పనులకు రాకుండా పోవడంతో అధికారులకు తిప్పలు తప్పడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి బకాయిలు చెల్లించడంతోపాటు చాలినంత మంది సిబ్బందిని నియమిస్తే కూలీల శాతం పెరిగే అవకాశం ఉంది.

నేడు మినీ ఉద్యోగ మేళా

రాయచోటిటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉదయం 9.30 గంటలకు మినీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప నగరంలోని షిర్డీసాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ కంపెనీలో ట్రైనీ క్వాలిటీ ఎగ్జిక్యూటివ్, ట్రైనీ సూపర్‌వైజర్, హెచ్‌ఆర్ ట్రైనీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మొత్తం ఖాళీలు 52 ఉండగా వాటిలో ట్రైనీ క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 20 ఉన్నాయని, ఆ పోస్ట్ కోసం బీఎస్సీ ఎంపీసీ చదివి ఉండాలని, సైట్‌కు వెళ్లి క్వాలిటీ టెస్టింగ్ చేయాల్సి వస్తుందని, జీతం రూ.15 వేలతో పాటు టీఏడీఏలు ఉంటాయని తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్ పోస్టులు 30 ఉన్నాయని, ఆ పోస్టులకు ఏదైనా డిగ్రీ చదివి ఉండాలని జీతం రూ.15 వేలతో పాటు టీఏ, డీఏలు ఉంటాయని వివరించారు. ట్రైనీ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 2 ఉండగా, జీతం రూ.18 వేలు ఉంటుందని, జిల్లా పరిధిలోని నిరుద్యోగులు రెస్యూమ్, ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో బుధవారం ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు. ఉద్యోగంలో చేరే వారు 5 ఏళ్లకు బాండ్ ఇవ్వాల్సి ఉంటుందని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

చెత్తసేకరణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

● మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు



పీలేరులో చెత్త సేకరణలో పాల్గొన్న డీఎల్‌పీఓ

పీలేరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు హెచ్చరించారు. మంగళ వారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి పంచాయతీ కార్యాలయం సహా పట్టణంలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా శానిటేషన్‌పై ప్రత్యేక చొరవ చూపాలని, ఎటువంటి మినహాయింపులు ఉండవన్నారు. విధినిర్వహణలో కార్యదర్శులు ఆద్యంతం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. మురుగునీటి కాల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలో మురుగు నీరు రహదారులపైకి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పీలేరు పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు

● జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై



వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటి సారిగా మన రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రభుత్వ సేవలను అందు బాటులోకి తెచ్చిం దని జిల్లా పశువైద్యాధి కారి గుణశేఖర్‌పిళ్లై, ఎంపీడీవో రాధాకృష్ణన్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచా యతీ కార్యాలయం నుంచి ప్రజల చేతిలో ప్రభుత్వం.. వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన పి4 గ్రామసభలో వారు మాట్లా డుతూ మనమిత్ర 955230 0009కు వాట్సాప్ నంబరు ద్వారా అందించే 200 ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సచివా లయ సిబ్బందికి సూచించారు. నాగిరెడ్డిపల్లె, నందలూరు సచివాలయంలో ఇప్పటివరకు 100 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసేందుకు ట్రస్టులు, గ్రామ పెద్దలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాగిరెడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి బండ్ల సురేష్‌కుమార్, వెంకటరమణ, వెంకట సుబ్బయ్య, సచివాలయ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివశంకర్

రాజంపేటటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండి దానివల్ల కలిగే లాభాలను వివరించాలని విశ్రాంత ఐఏఎస్, ప్రకృతి వ్యవసాయాధికారి టి.విజయ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రబల్లెలో వీఏఏలు, వీహెచ్‌ఎల్స్‌కు మూడు రోజుల పాటు అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండానే సహజ సిద్ధమైన పద్ధతులతో సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. రసాయనాల వాడకంతో భూమిలో పోష్టిక విలువలు తగ్గిపోతాయన్నారు. దీనివల్ల మనం తీసుకునే ఆహారంలో సూక్ష్మ పోషకాలు తగ్గి అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్నారన్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో నీటిపారుదల సౌకర్యం లేని మెట్ట భూముల్లో కూడా ఏడాదికి మూడు పంటలు పండించవచ్చని వివరించారు. ఈ పద్ధతులతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల ఉప వ్యవసాయ సంచాలకులు ఏడీఏ శివశంకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు హార్టికల్చర్ సహాయకులు వెంకటరమణనాయక్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీఎస్పీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె మండలం, పోతబోలు గ్రామంలోని శ్రీవేద పాఠశాల్లో నిర్వహించిన రాష్ట్ర సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్ క్రీడల్లో డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలను స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. విజేతలకు మెమోంటోలు అందించి అభినందించారు. సబ్ జూనియర్ చాపియన్ షిప్‌లో భాగంగా 8 జోన్‌ల నుంచి 9 జట్లు పాల్గొనగా ప్రథమ స్థానం కడప, 11వ స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో అనమయ్య జిల్లాల జట్లు నిలిచారని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీధర్ తెలిపారు. ఇందులో ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి, దిలీప్‌కుమార్, కోచ్ హరి, పవన్, శ్రీనివాసులు, సురేష్, ఉమాదేవి, మహేంద్ర, ఇర్షాద్, అంజనప్ప, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

మున్సిపల్ కార్మికుడిపై దాడి

● నలుగురిపై కేసు నమోదు



దాడిలో గాయపడిన సుధాకర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఫిట్టర్ సుధాకర్‌పై దాడి చేసిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గాంధీపురం వాసులు రాజా, రవి, ప్రదీప్, మరికొందరితో కలిసి సోమవారం దాడి చేసి గాయపరిచారని తెలిపారు. వ్యక్తిగత కక్షలతోనే ఘర్షణ జరిగినట్లు చెప్పారు. గాయపడిన సుధాకర్‌ను మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేసి ఫిట్టర్‌పై దాడి చేసి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



గాయత్రి (ఫైల్ ఫొటో)

నిమ్మనపల్లి ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యం కావడంతో భర్త నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ గుండ్లబురుజు వాసి నరేష్ భార్య గాయత్రి(22) ఇంటి వద్ద వుంటూ కుటుంబాన్ని చూసుకునేది. అయితే తాను పెయింటింగ్ పనుల కోసం మదనపల్లి వెళ్లగా సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేశాడు. కాగా వీరికి ఇద్దరు చిన్న పిల్లలు వున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రాజధాని ప్రీమియర్ లీగ్ రన్నర్స్‌గా పీలేరు జట్టు



రన్నర్స్ ట్రోఫీతో పీలేరు ఐబీటీ విద్యార్థులు

పీలేరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో జరిగిన రాజధాని ప్రీమియర్ లీగ్ టీ 20 క్రికెట్ టోర్నీలో పీలేరుకు చెందిన ఇండియన్ బీచ్ ట్రీ(ఐబీటీ) పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. హైదరాబాదు టీ20 అసోసియేషన్ పీవీపీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎనిమిది టీమ్‌లు పాల్గొనగా ఫైనల్స్‌లో హైదరాబాదు ఏఎంసీ జట్టు చేతిలో పీలేరు జట్టు పరాజయం పాలై రన్నర్స్‌గా నిలిచినట్లు ఐబీటీ ప్రిన్సిపాల్ భార్గవి, కరస్పాండెంట్ సుదర్శన్ నాయుడు తెలిపారు.

రుణ ప్రణాళికలపై అవగాహన కల్పించాలి

వీరబల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రుణ ప్రణాళికలపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బండి సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తమ జీవనోపాధికి ఎంత రుణం కావాలి, ఎప్పుడు కావాలి అను వివరాలు యాప్‌లో బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఈ వివరాలు సంబంధించిన బ్యాంక్ మేనేజర్‌కు వెళతాయ న్నారు. మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాలు సక్రమంగా పుస్త కాలతోపా సమావేశాలు సక్రమంగా నిర్వహించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు గంగార్జున, వెంకట్రమణ, లీగల్ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, స్థానిక ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు కృష్ణయ్య, సుధాకర్, గంగాధరం, నాగేంద్ర, గ్రామ సమాఖ్యల సిబ్బంది అందరూ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ బండి సత్యనారాయణ

ముగ్గురు ప్రభుత్వ ఏజీపీలకు ఉద్వాసన

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాలోని మూడు న్యాయ స్థానాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ సహాయ న్యాయవాదుల సేవలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం మంగళవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లా ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా పనిచేస్తున్న సి.పవన్ కుమార్‌రెడ్డిని ప్రభుత్వం తొలగించింది. 2023 ఆగస్టు 22న ఆయనను మూడేళ్ల పదవీ కాలంతో ప్రభుత్వ ఏజీపీగా నియమించింది. అదే విధంగా అన్నమయ్య జిల్లా నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2024 ఫిబ్రవరి 27న మూడేళ్ల కాల వ్యవధితో సమీవుల్లా ఖాన్‌ను ఏజీపీగా నియమించారు. ఇదే జిల్లాలో తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2024 ఫిబ్రవరి 27న మూడేళ్ళ పదవీ కాలంతో బి.నాగమల్‌రెడ్డిని ఏజీపీగా నియమించారు. ఈ ముగ్గురి సేవలను పాలనాపరమైన సౌలభ్యత కోసం ఉపసంహరించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం పేర్కొంది. నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనల ప్రకారం తొలగిస్తున్నట్లు కూడా ప్రభుత్వం తెలిపింది. కాగా ఈ ముగ్గురికి తొలగింపు గడవు నెలరోజుల వ్యవధిలో వున్నందున ఒక నెల గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకోవలసిందిగా ఆయా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అంతేగాకుండా కేసులకు ఆటంకం కలగకుండా సమీప కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జీలుగా నియమించాలని కూడా ప్రభుత్వం సూచించింది. ఈ ముగ్గురి స్థానాల్లో కొత్త ఏజీపీల భర్తీ కోసం తగిన అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా తొందరగా సమర్పించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం మూడు వేర్వేరు ఆదేశాలు జారీ చేశారు.

బిందు సేద్యంతో అధిక దిగుబడులు

● ఐదెకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ

● జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న



మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు వివరిస్తున్న జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న

తంబళ్లపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బిందు సేద్యంతో తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం ఏటిగడ్డతండాలో ఎస్టీ రైతులకు సూక్ష్మ నీటి సాగుపై నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాదికి 14000 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఐదెకరాలు లోపు పంట పొలాలున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం వంద శాతం రాయితీ, ఓసీ, బీసీ రైతులకు 90 శాతం రాయితీ, 10 ఎకరాల వీస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 90 శాతం రాయితీ అందజేస్తుందన్నారు. డ్రిప్ పరికరాలు అవసరమున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ జిరాక్సు భూమి పాసుపుస్తకం, వన్-బీతో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలియ చేశారు. ప్రభుత్వం గుర్తించిన 30 కంపెనీల పరికరాల్లో ఏ కంపెనీకి చెందినవైనా రైతులు తీసుకోవచ్చని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న పదిహేను రోజుల్లో రైతులకు పరికరాలు అందజేస్తా మన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఓ రైతు పొలంలో విక్రయానంతర సేవలు (ఏఎస్ఎస్) కార్యక్రమం నిర్వహించి రైతులకు- మైక్రో ఇరిగేషన్ పరికరాల నిర్వహణ, నీటి, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. మైక్రో ఇరిగేషన్ పద్ధతులు అవలంభించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులతో మంచి ఆదాయం పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఐ డీసీ హరినారాయణ, ఎంఏఓ వెన్నెల, ఎంఐ కంపెనీల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మామిడి సాగులో రైతులకు అవగాహన

రామసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాప్పల్లెలో మామిడికాయ కోతనంతరం తీసుకోవాల్సిన చర్యలపై రైతు లకు అవగాహన చేపట్టారు. మదనపల్లి ఉద్యాన శాఖాధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యానశాఖ తరపున రైతులకు మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, జామ వంటి పండ్ల తోటలకు రాయితీపై మొక్కలు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు మల్చింగ్ పేపర్‌కు, పూల మొక్కలు, కూరగాయల సాగుకు ఎకరాకు రూ.8వేలు రాయితీ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎవరైనా పాలీహౌస్, షేడ్‌నెట్‌హౌస్ నిర్మించుకుంటే 50శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో కాయల కోత అనం తరం చేయాల్సిన యాజమాన్య పద్ధతులపై వివరిస్తూ కొమ్మ కత్తిరిం పులు, ముదురు చెట్ల పునరుద్ధరణ, తల మార్పిడి విధానం, కొత్తగా చెట్లు నాటి రైతులు ట్రైనింగ్, ప్రూనింగ్ చేయాల్సిన పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఏఓ జాఫర్, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహన

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రంలో మంగళవారం మేరా రేశం.. మేరా అభిమాన్ పట్టురైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతయ్య, పరుషోత్తం రైతులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పట్టు రైతులకు అనేక సబ్సిడీ పథకాలను అందిస్తోందని, కేంద్ర ప్రభుత్వం అందించే పలు సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకాలపై రైతులకు ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులు పట్టు పురుగులను పెంచేలా చూడాలన్నారు. మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సిరికల్చర్(ఏడి) రామమోహన్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగార్జున, చెరువు సంఘం చైర్మన్ చెన్నకేశవులు, టీడీపీ నాయకులు మహబూబ్‌బాష, సాంకేతిక సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

సిద్దవటం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె కనిపించడం లేదంటూ సిద్దవటం మండలం లింగంపల్లె వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ఈ గ్రామానికి చెందిన సుభాషిణి అనే విద్యార్థిని టక్కోలి జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతోంది. ఆగస్టు 2న స్కూలుకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరా తీయగా ఉమ్మడి అంజనేయులు అనే వ్యక్తి ఆమెను ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడని తేలింది. ఈ మేరకు వారు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

కడప పట్టణాభివృద్ధి సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా శాంతిప్రసాద్

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో కడప పట్టణాభివృద్ధి సంస్థ తరపున కేసులను వాదించడానికి అడ్వకేటు సింగలూరి శాంతిప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కడపతో పాటు చిత్తూరు, కర్నూలు, అనంతపురం, పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థల తరపున కూడా శాంతిప్రసాద్ హైకోర్టులో న్యాయ వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు. మూడేళ్ళ వరకూ గానీ లేదా ఆలోగా తొలగించే వరకూగానీ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని, గతంలో వున్న నిబంధనల మేరకు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభసాటి

పీలేరురూరల్, ఆగస్ట 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుందని పీలేరు ఏడీఏ రమణ రావు తెలిపారు. మంగళవారం దొడ్డిపల్లె రైతు సేవా కేంద్రంలో ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, అవగాహన, తాము అనుసరించాల్సిన సాంకేతికత, వ్యవసాయ విధానాల్లో మార్పులపై వివరించారు. డాక్టర్ పవన్‌కుమార్, ఎంపీడీఓ జి.శివశంకర్, పీలేరు, కేవీపల్లె మండలాల వ్యవసాయ అధికారుల సుభాషిణి, సుబ్బరామయ్య, రమాదేవి, కరుణాకర్‌రెడ్డి, అల్తాఫ్, నజీర్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

తలనీలాల వేలం రూ.5.10 లక్షలు

సిద్దవటం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజేశ్వరకోనలో సెప్టెంబరు 1 నుంచి 2026 ఆగస్టు 31వ తేది వరకు తలనీలాలు సేకరించేకునే హక్కులకు మంగళవారం ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్, దేవదాయశాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. సిద్దవటంలోని రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఈ వేలంలో కమలాపురానికి చెందిన నాగయ్య రూ.5.10 లక్షలకు హక్కులు దక్కించుకున్నారని ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. గత ఏడాది కన్నా ఈ సారి రూ.2.28 లక్షలు అదనపు ఆదాయం లభించిందని వివరించారు.

రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగేనా..!

- వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులు
- కూటమి ప్రభుత్వంలో అయినా మొదలయ్యేనా..
- ఆశగా ఎదురుచూస్తున్న గ్రామీణప్రాంత ప్రజలు



పోరుమామిళ్ల నుంచి బాలరాజుపల్లెకు వెళ్లే రంపాడు రోడ్డు

పోరుమామిళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా.. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో దాదాపు రద్దు అయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తిరిగి అంచనాలు వేసి ప్రస్తుత రేట్ల ప్రకారం నిధులు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. నిధులు మంజూరైతే గ్రామీణ రహదారులకు మహర్దశ వస్తుందని ఆయా గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పోరుమామిళ్ల నుంచి బాలరాజుపల్లెకు వెళ్లే రంపాడు రోడ్డు. దాదాపు 70 గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి. రంపాడు నుంచి బాలరాజుపల్లె మీదుగా అటు అమగంపల్లె, ఇటు నరసాపురం, జ్యోతి క్షేత్రం వరకు ఈ రహదారి అనుసంధానంగా ఉంటుంది. దీంతో విద్యార్థులు, వ్యాపారస్తులకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారి నుంచి రెండు లైన్ల రహదారి నిర్మాణానికి (సుమారు 12 కి.మీ) రూ.32కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పటి రాజకీయ పరిసితులు, కాంట్రాక్టర్లు రోడ్డు పనులు పనిచేసేందుకు ముందుకు రాకపోవడంతో ఆ పనులు రద్దయ్యాయి. దీంతో ఈ రోడ్డు గుండా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. రోడ్డు విస్తరణ పనులు చేపడితే రైతులు తాము పండించిన పంటలను పోరుమామిళ్లకు తరలించుకునేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రంపాడు రోడ్డు నుంచి బాలయపల్లె వరకు దాదాపు ఒక కి.మీ వరకు సింగల్ రోడ్డు ఉండడంతో నివాసగృహాల ముందు చెత్త చెదారాలు నిల్వ ఉండడం, డ్రైనేజీ కాల్వలు సరిగా లేక ఈ ప్రాంత మంతా అధ్వానంగా తయారైంది. ఈరహదారి నిర్మాణానికి నిధులు మంజూరైతే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానిక ప్రజలు అంటున్నారు.

ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ సలీంను వివరణ కోరగా గత ప్రభుత్వ హయాంలో పోరుమామిళ్లలోని రంపాడు రోడ్డు నుం చి బాలరాజు పల్లె వరకు సుమారు 12 కిమీ సంబంధించి రూ.32 కోట్లు నిదులు మంజూరయ్యాయి. పనులు మొదలు పెట్టకపోవ డంతో రద్దయ్యాయని, ప్రస్తుతం అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. తిరిగి నిధులు మంజూరైతే ఆ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

వైవీయూలో ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎంబీఏ శాఖలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌గా తిరుపతి నేషనల్ సాంస్క్రిట్ విద్యాపీట్ ఎంఎంసీఏ విభాగ ప్రొఫెసర్ జి.శ్రీధర్ హాజరయ్యారు. వైవీయూ ప్రొఫెసర్ ఏజీ దాము, కామర్స్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ పి.సరిత, డాక్టర్ గంగయ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల మైక్రోటీచింగ్‌ను, అకడమిక్ ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల మార్కులను పరిగణలోకి తీసుకొని ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తామని వారు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల (ఆర్ట్స్) కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ కోర్సు లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రత్యేక కేటగిరీ పత్రాల పరిశీలన ఆగస్టు 21 నుంచి 23 తేదీలలో జరుగుతుందన్నారు. కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదు ఆగస్టు 21 నుంచి 24వ తేదీ వరకు, వెబ్ ఆప్షన్ల మార్పునకు ఆగస్టు 25 వరకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థుల కోసం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. సీట్లను ఆగస్టు 27వ తేదీకి కేటాయిస్తారని, తరగతులు ఆగస్టు 28 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

క్యాన్సర్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్ ఆగ స్టు 5,(ఆంధ్రజ్యోతి) ఎన్‌సీడీ-4.0 సర్వేలో ఉన్న క్యాన్సర్లపై వైద్య సిబ్బందికి మెరుగైన శిక్షణ, అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో ఎన్‌సీడీ-4.0 సర్వేలో గుర్తించిన సర్వేలపై సంబంధిత వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన గైనకాలజిస్టులు, డెంటల్ వైద్యులతో పాటు ఇతర వైద్య సిబ్బంది తాము పనిచేస్తున్న కేంద్రాలలో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలకు తదుపరి శిక్షణలు ఇవ్వాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసరు డాక్టర్ రమేష్, డాక్టర్ జీవన్‌ప్రియల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కడప, అన్నమయ్య జిల్లాలోని సెకండరీ హెల్త్ సెక్టార్‌లో పనిచేసే గైనికాలజిస్టులు, డెంటల్ వైద్యులు, రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టుకున్న పాము, పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రేగిన దృశ్యం

ట్రాన్స్‌ఫార్మర్‌కు పాము చుట్టుకొని విద్యుత్ అంతరాయం

కొండాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నక్కాతోట సమీపంలో ట్రాన్స్‌పార్మర్‌కు పాము చుట్టుకోవడంతో మెయిన్‌లైన్ తీగలకు షార్ట్ సర్క్యూట్ జరిగింది. అలాగే కొండాపురం సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌పార్మర్‌లో మంటలు చేలరేగాయి.. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు ఏఈ వీరారెడ్డి తెలిపారు. మంగపట్నం ఫీడర్‌తో పాటు కొండాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఏడుగంటల దాకా, కొండాపురం టౌన్ పరిధిలో కొంతవరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నప్పటికీ ఎక్కువ మొత్తంలో లైన్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయందని తెలిపారు. పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రావడంతో కడప నుంచి టెక్నికల్ సిబ్బంది వచ్చి మరమ్మత్తులు చేశారని, దీంతో ఆలస్యం అయిందన్నారు. మంగపట్నం ఫీడర్‌లో దాదాపు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని తెలిపారు.

యువకుడిపై దాడి కేసులో నలుగురు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడిపై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తాహిర్‌హుసేన్ తెలిపారు. రవీంద్రనగర్ గుర్రాలగడ్డకు వెళ్లే బుగ్గవంక దారి సమీపంలో ఈనెల 3న చాంద్‌బాషా అనే యువకుడిపై ఇస్మాయిల్ మరో ముగ్గురు కలిసి కత్తితో దాడి చేశారు. గాయపడ్డ చాంద్‌బాషా రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనలో నిందితులైన ఇస్మాయిల్‌తో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని.. మైనర్లను ప్రభుత్వ బాలుర గృహానికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాజుపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టంగుటూరు బీసీ కాలనీకి చెందిన మాబుషరీఫ్ (26) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మాబుషరీఫ్ తల్లి పొలానికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ... వ్యక్తికి గాయాలు

పులివెందుల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉలిమెల్ల రింగురోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో సతీష్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం 1.40గంటల ప్రాంతంలో జగనన్న హౌసింగ్ లేఅవుట్ రోడ్డు నుంచి సతీష్‌కుమార్‌రెడ్డి వస్తూ.. రోడ్డు దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో సతీష్‌కుమార్‌రెడ్డి తలకు, కాళ్లకు రక్తగాయాలయ్యాయి. ఇతను యూసీఐఎల్‌లో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

లింగాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుణకనపల్లె గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గుణకనపల్లె గ్రామానికి చెందిన లోమడ శ్రీనివాసులు బెల్టుషాపులో మద్యం అమ్ముతుండడతో దాడి చేసి.. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కులుకు భజన కళాకారుడు ఆకస్మిక మృతి



పుల్లయ్య (ఫైల్)

కలసపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హృద యపేటకు చెందిన కులుకు భజన కళాకారుడు, రాష్ట్ర హంస అవార్డు గ్రహీత సగిలి పుల్లయ్య ఆకస్మిక మృతి చెందారు. సోమవారం రాత్రి ప్రొద్దుటూరు ప్రాంతంలోని ఓ గ్రామంలో జరిగిన కోలాటం కార్యక్రమంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలి పడి పోయాడు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాగా, పుల్లయ్య ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో తన కులుకు భజనతో ఆకట్టుకొని అనేక అవార్డులు అందుకున్నారు. పలువురుకి తన విద్య నేర్పి భజన గురువులుగా తయారు చేసి ఉపాధి కల్పించారు. ఆయన మృతిని తోటి కళాకారులు, శిష్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆయన మృతదేహాన్ని టీడీపీ, వైసీపీ నాయకులతో పాటు వివిధ చర్చిల ఫాదర్‌లు, కళాకారులు, భారీగా ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు.

పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ కీలకం



కొక్కిరాయపల్లెలో ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు చూడామణిరెడ్డి, దివాకర్‌రెడ్డి

చెన్నూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ కీలకమని కేంద్ర పరిశీలకుల బృందం సభ్యులు చూడామణిరెడ్డి, దివాకర్‌రెడ్డిలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మండలానికి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు మంగళవారం కొక్కిరాయపల్లె గ్రామంలో వివిధ రకాల అభివృద్ధి పనులు పరిశీలించి.. స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పంటకాల్వల్లో పూడికతీత, గోకులం షెడ్లు, రోడ్లను పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ పనులు ఎలా జరుగుతున్నాయి.. ఎంత మంది కూలీలు వస్తున్నారు.. రోజూ ఎంత కూలి పడుతోందని ఆరా తీశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రతి పంచాయతీలో ఏటా వచ్చే నిధులతో ఎలాంటి పనులు చేపడుతున్నారు.. ఆ పనులతో ఆయా గ్రామాల ప్రజలకు కలిగే ప్రయో జనాలు, ప్రతి నెలా పింఛను సక్రమంగా అందుతుందా, లేదా పింఛనుకు దరఖాస్తు చేసుకుంటే ఎన్ని రోజులకు వస్తుంది.. తదితర వాటి గురించి ప్రజలను అడిగి తెలుసుకుఆన్నరు. కేంద్రం అందించే ప్రతి సంక్షేమ పథకం ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో అందేలా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో గంగాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీడీలు సుబ్బారెడ్డి, రామలింగారెడ్డి, ఆనంద్, రఘు, పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, కార్యదర్శి రేణుకాదేవి పాల్గొన్నారు.

జిల్లాలో ఎనాక్స్ ప్రాజెక్ట్ అమలుకు అవగాహన ఒప్పందం



ఎనాక్స్ ప్రాజెక్ట్‌పై ఒప్పందం కుదుర్చుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 5,(ఆంధ్రజ్యోతి): సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహార-వ్యవసాయ కన్వర్జెన్స్ (ఎనాక్స్) అనే కార్యక్రమాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసేందుకు జిల్లా పరిపాలనా యంత్రాంగం, ఇండియన్ స్కూలు ఆఫ్ బిజినెస్, హైదరాబాద్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి డిజిటల్ సైన్ చేసిన అవగాహన ఒప్పంద పత్రాన్ని హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, బీఐపీపీ అసోషియేట్ ప్రొఫెసర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్వినీ ఛాత్రేకి సంబంధిత ప్రాజెక్ట్ ప్రతినిధి అధికారుల సమక్షంలో సమర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ఐఎస్‌బీ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సమకూర్చే నిధులతో సాంకేతిక మద్దతు ద్వారా పోషకాలు అధికంగా ఉండే ఆహారపదార్థాల లభ్యత, పౌష్టిక సామర్థ్యాన్ని మెరుగు పరచడానికి సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహారం-వ్యవసాయ కన్వర్జెన్స్ అనే పైలెట్ ప్రాజెక్ట్ జిల్లాలో అమలు కానుందన్నారు. అంగన్వాడీలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో, గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పోషణ విలువలతో కూడిన ఆహారం, పంటల ఉత్పత్తిని పెంపొందించే దిశగా జిల్లాలో ఆయా శాఖలతో సమీక్షించి క్షేత్రస్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం అవుతారన్నారు. ఎనాక్స్‌లో రాపిడీ రెస్పాన్స్ రీసెర్చ్ (ఆర్ఆర్ఆర్) అనే ప్రత్యేక విభాగం ఉందని, ఇది జిల్లా స్థాయిలో వ్యవసాయ-పోషకాహార కలయికను తెలియజేయడానికి, ఆయా రంగాలకు మద్దతు ఇవ్వడానికి, సకాలంలో డిమాండ్ ఆధారిత స్థల ఆధారిత పరిశోధనలను చేయడానికి రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎనాక్స్ ప్రతినిధులు వైష్ణవి, స్మృతి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరకు మార్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యాన తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

అనధికార లేఔట్‌ల నియంత్రణకు అవకాశం

కడప రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఔట్‌ల నియంత్రణకు అవకాశం కల్పించిందని డీపీవో రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రయ ఒప్పందం, హక్కు పత్రంలో ఉన్న అనధికార లేఔట్ లేదా ప్లాట్‌కు 90 రోజుల్లో వ్యక్తిగతంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందన్నారు. కొత్త దరఖాస్తుల కోసం ఆగస్టు 4 నుంచి ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. 50 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు తగ్గింపు ఉంటుందన్నారు. 4000 చదరపు మీటర్ల లోపు విభజన లేకుండా ఉన్న ప్లాట్‌కు కూడా అర్హత ఉంటుందన్నారు. ఇప్పటికే ఐపీఎల్‌పీ ఆమోదించిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 9849966639 నెంబర్‌లో కుడా ఏపీవోను సంప్రదించాలన్నారు.

డిగ్రీ పరీక్షల తనిఖీ

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైవీయూ కేంద్రంగా జిల్లాలోని అన్ని డిగ్రీకళాశాలల విద్యార్థులకు సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో కలిసి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. వసతుల గురించి ఆరా తీశారు. ఈ పరీక్షలకు 278 మంది హాజరు కాగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, తదితరులు ఉన్నారు.

బ్రహ్మంగారి మాస కల్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధం



మాస కల్యాణ మహోత్సవానికి సిద్ధమైన కల్యాణ మండపం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత గోవిందమాంబల మాస కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మందిరాన్ని అలంకరణ చేసి సిద్ధం చేశామన్నారు. కల్యాణ మహోత్సవ ఉభయదాతలు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి

పులివెందుల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అంకిరెడ్డి సురేశ్‌రెడ్డి (సైదాపురం చంటి), అతని అనుచరుడు అమరేశ్వర్‌రెడ్డిలపై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దాడి చేశారు. పులివెందుల పట్టణంలోని శ్రీకర్ కళ్యాణమండపం సమీపంలో ఈ దాడి జరిగింది. వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వీరిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకే మా పార్టీ నాయకుడిపై దాడి చేశారన్నారు. ఏడాది కాలంగా ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా ఓట్లకు వెళితే ఓడిపోతామని




సురేశ్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

హత్యా రాజకీయాలకు తెర లేపారన్నారు. హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాష, అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి మరి కొందరు కర్రలతో దాడి చేశారన్నారు. కాగా, ఈ దాడికి సంబంధించి బీటెక్ రవి ఒక వీడియో విడుదల చేసి మాట్లాడారు. సురేశ్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన అవినాశ్‌రెడ్డి మా పార్టీ నాయకుడని సంబోధించడం సరైంది కాదన్నారు. సురేశ్‌రెడ్డి జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారన్నారు. అతన్ని తమ పార్టీ నాయకుడిగా ఎంపీ ఎలా ప్రకటిస్తా రన్నారు. సురేశ్‌రెడ్డిపై దాడి చేసి జగన్ మామ అయిన ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రికి తరలించారన్నారు. దాడి చేస్తే ప్రభుత్వ ఆసు పత్రికి తరలించాలి తప్ప ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి నుంచి వచ్చి కుట్లు వేయడం, తుడవడం లాంటివి చేశారన్నారు. ఇపుడు సురేశ్‌రెడ్డికి ఏదైనా ఇంజక్షన్ గాని చేసి ప్రాణహాని కలిగిస్తే ఎన్నికలు ఆగిపోతాయనే దురుద్దేశం దాగి ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. వెంటనే పోలీసులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించాలన్నారు.



మాట్లాడుతున్న బీటెక్ రవి



ఒంటిమిట్ట జడ్పీటీసీని ముఖ్యమంత్రికి కానుకగా ఇస్తాం..

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆ స్థానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కానుకగా ఇస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం మండలంలోని పెన్నపేరూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 12న జరిగే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. టీడీపీ జనసేన, బీజేపీ కలిసి మండలంలో టీడీపీ జెండా రెపరెపలాడేలా అత్యధిక మెజారిటీని తీసుకురావాలన్నారు.

100 కుటుంబాలు టీడీపీలో చేరిక

రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో మండలంలోని వైసీపీకి చెందిన 100 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబు, పార్టీ పరిశీలకులు చిట్టిబాబు, పార్టీ సీనియర్ నాయకులు హరిప్రసాద్, రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, బొడ్డే వెంకటరమణ, పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరుతున్న వారికి పార్టీ కండువా వేసి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ వెంటనే కొత్త అక్రిడేషన్ కార్డులతో పాటు వారి సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీయూడబ్ల్యుజే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2019లో రాష్ట్రంలో 23 వేల మంది జర్నలిస్టులు ఉండగా, అడ్డగోలుగా నిబంధలతో కేవలం 9 వేల మందికి మాత్రమే అక్రిడేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో అర్హులైన జర్నలిస్టులు హెల్త్ కార్డులు ఇంకా ఇతర విషయాల్లో వెనుకబడిపోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలాగే అడ్డగోలు నిబంధనలతో అక్రిడేషన్ జారీ చేసే విషయంలో అలసత్వం వహించం అని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అక్రిడేషన్ నియమ నిబంధనలు ఇంతవరకు విడుదల చేయకుండా గతంలో ఉన్న అక్రిడేషన్‌లనేగడువు పొడిగిస్తూ కాలయాపన చేస్తోందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో లోపాలను సవరించి వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయాల్సిందిగా వారు డిమాండ్ చేశారు. 2016లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన ప్రమాదబీమా పథకాన్ని గత గవర్నమెంట్ నిలిపివేసిం దని, వెంటనే పునర్ ప్రారంభించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛన్ పథకాన్ని మన రాష్ట్రం కూడా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏవో నాగ భూషణంకు వినతిపత్రం అందేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పత్రికా విలేకరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

ఉద్యోగుల సమస్యలపై 'టీ తాగుతూ చర్చించుకుందాం రండి'

● ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీ. లక్ష్మీప్రసాద్

రాయచోటిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని అన్వేషించడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ప్రారంభించిన 'టీ తాగుతూ చర్చించుకుందాం 'అనే కార్యక్రమాని మంగళవారం ఉప ఖజానా కార్యాలయం ఆవరణలో ఏపీజీఏ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, పీఆర్సీని పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడినా ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. 'రండి టీ తాగుతూ.. మాట్లాడుకుందాం ' కార్యక్రమంలో ఉద్యోగ సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే సత్వరం జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో తాము ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని, ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, తాలూకా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సుజిత్‌డాల్, ఉపాధ్యక్షుడు వేణు, వెంకటేశ్వర్లు, సహాయక కార్యదర్శి రఘు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రాజా, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రైల్వే కోడూరు రెవెన్యూ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, కార్యదర్శి గల్లా రమణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ గురుమహేష్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణంరాజు ఉమాట్లాడుతూ ఒక్కో ఉద్యోగికి రూ. 3 నుంచి రూ. 4 లక్షల వరకు ప్రభుత్వం బకాయి ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు స్థలా లను కేటాయిస్తే బకాయిలు తీరిపోతాయని ప్రభుత్వానికి ఇది వరకే విన్నవిం చామని వివరించారు.



సమస్యలపై చర్చిస్తున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్

'ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి'



మాట్లాడుతున్న జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు

రాజంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గాలి చంద్ర అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ సీపీఐ 12వ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అంకితం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాడన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ హామీ నీటిమీద రాతగా మారిపోయిందన్నారు. ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చిన కూటమి నాయకులు ఇంతవరకు ఆ హామీల అమలుకు ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. నిరుద్యోగభృతి, ఉద్యోగ కల్పన హామీలు రద్దు చేసుకున్నారన్నారు. అన్నమయ్య జిల్లాలో ఉన్న వనరుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇ.సికిందర్, గాలి చంద్ర, కాటంశెట్టి వెంకటయ్య, సర్తాజ్, శివయ్య, నాగేశ్వరరావు, నరసింహులు, మహమ్మద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీగోడ నిర్మాణానికి సహకరిస్తాం

ఓబులవారిపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నఓరంపాడులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జడ్పీ హై స్కూళ్లను తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. చిన్నఓరంపాడులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రహరీగోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్, విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పయ్యావుల కోటేశ్వరరావు, పొలసాని కిరణ్, అన్నెపు మహేష్, అడపాల ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ముక్కాసాయివికాస్‌రెడ్డి

బ్యాంకు పథకాలపై అవగాహన

ఓబులవారిపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జనసురక్ష, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు వివిధ బ్యాంకుల అధికారులు తెలిపారు. జన సురక్ష ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల్లో భాగంగా బోటుమీదపల్లె గ్రామంలో ముక్కవారిపల్లె కెనరా బ్యాంకు సిబ్బంది శివశంకర్‌రెడ్డి మంగళంపల్లెలో, ఏపీజీబీ మంగంపేట బ్రాంచ్ సిబ్బంది ప్రమోద్, వంశీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై సుకన్య సమృద్ధి యోజన, ఏపీవై, ఎన్‌పీఎస్ వంటి పథకాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు.విడ్స్ కౌన్సిలర్లు ప్రతాప్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనేరు క్రాస్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో 2025-26 సంవత్సరానికి మిగిలిన 120 ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పులి రామకృష్ణ తెలిపారు. స్థానిక బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు ఎస్సీ, ఎస్టీ, బీసీ విభాగానికి చెందిన బాలురకు 120 సీట్లు, 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆగస్టు 8వ తేదీ లోపల ఆధార్‌కార్డు, కులధ్రువీకంరణ పత్రం, చరవాణి సంఖ్యతో నేరుగా కళాశాలకు వచ్చి సంప్రదించాలని కోరారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మల్లికార్జున



గాలివీడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా సీ. మల్లికార్జునను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గాలివీడు మండలం ఎగువ గొట్టివీడు గ్రామానికి చెందిన ఈయన మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. తన సేవలను గుర్తించిన అధిష్టానం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించినట్లు ఆయన తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ హైస్కూలుకు బీరువా, మైక్‌సెట్ విరాళం

రైల్వేకోడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శెట్టిగుంట జడ్పీ హైస్కూలుకు మంగళ వారం వాసవీ క్లబ్ సభ్యులు బీరువా, మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ పెండ్యాల విజయకుమార్, రీజనల్ వైస్ చైర్మన్ గాదంశెట్టి సుమన్ కుమార్, రైల్వేకోడూరు క్లబ్ అధ్యక్షుడు తిరునామాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హైస్కూలుకు బీరువా, మైక్‌సెట్ అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ

రైల్వేకోడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 200 సేవలను ప్రజలు అందుకోవచ్చునని రైల్వేకోడూరు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వర ప్రసాద్‌రావు తెలిపారు. మంగళ వారం రైల్వేకోడూరులో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. రైల్వేకోడూరు సర్పంచ్ బుడిగి శివయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రాజు, వార్డు సభ్యులు నార్జాల హేమరాజ్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

పెనగలూరు: ఎంపీడీవో విజయరావు అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం నిరంజన్‌కుమార్, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆశ వర్కర్ల మహాసభలను జయప్రదం చేయండి'

రైల్వేకోడూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఆశ వర్కర్ల మహాసభలు ఈ నెల 30, 31 తేదీల్లో కడపలో నిర్వహిస్తున్నట్లు ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ పీ. రత్నమ్మ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. యూనియన్ నాయకురాళ్లు రత్న కుమారి, రాజమ్మ, భాగమ్మ, శ్రీలేఖ, సునీత, వరలక్ష్మి, వెంకటసుబ్బమ్మ ఆపాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సైబర్ నెట్‌వర్క్ టీం సభ్యులు పీరమ్మ, విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక నలంద హైస్కూల్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9, 10వ తరగతి విద్యార్థులు సైబర్ నేరాలపై దృష్టి సారించాలన్నారు. పల్లెల్లో చాలా మంది సెల్‌ఫోన్ ద్వారా చాలా మందిని మోసగిస్తున్నారన్నారు. వీటిపై పల్లెల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలు పాఠశాలకు వచ్చే సమయంలో అల్లరి మూకలు ఏడిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

వీరభద్రాలయంలో రుద్రాభిషేకాలు

రాయచోటిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మంగళవారం రుద్రాభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాసం రెండవ మంగళవారం సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి విచ్చేసిన 675 మంది భక్తులు రుద్రాభిషేకాలు చేయించుకున్నారు. భక్తులందరికీ దేవస్థాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య అభిషేకం, :భద్రకాళీ అమ్మవారి గుడిలో కుంకుమార్చన నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి పర్యవేక్షించారు

తల్లిపాలు శిశువులకు మంచి పోషకాహారం

వీరబల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యో తి): తల్లిపాలల్లో శిశువులకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని ఐసీడీఎస్ పీడీ హేమావతి అన్నారు. వీరబల్లి లో మంగళవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ హేమావతి మాట్లాడుతూ ప్రతి తల్లీ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తప్పక తాగించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో బసిరెడ్డి, ఏపీవో ఖాదర్‌వలి, హౌసింగ్ ఏఈ వెంకటేశు, సూపర్‌వైజర్లు సరస్వతిదేవి, తులసమ్మ, వెలుగు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి

సిద్దవటం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుకు మరమ్మతులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం వాహనాల ను అడ్డుకున్నారు. మండలంలోని బండికనుమ నుంచి లింగంపల్లె వరకు రూ.5 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో స్కూల్ బస్సులకు, అంబులెన్స్‌లకు ఇబ్బందిగా మారిందని, కడపాయపల్లె ఎస్సీ కాలనీ వద్ద వాహనాలను నిలిపివేశారు. ఈ రోడ్డు మరమ్మతులకు అంచనా వేసి నివేదిక పంపిసామని ఆర్ అండ్ బి ఏఈ రామాంజనేయులు తెలిపారు.

'స్మార్ట్ మీటర్లు వద్దు.. డిజిటల్ మీటర్లే ముద్దు!'

రైల్వేకోడూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదని, ట్రూఅప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని మంగళవారం రైల్వేకోడూరులోని విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల కుంభకోణంలో బడా పారిశ్రామిక వేత్తలు కోట్లాది రూపాయలు దోచుకున్నారని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వం లోనే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీన్నే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించి డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగులగొట్టండని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం వీటిపై ఇంత వరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. ఆదానీ, షిరిడీసాయి ఎలక్ట్రికల్ కంపెనీతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. అదే కాంట్రాక్టర్లతో కమీషన్లకు కక్కుర్తిపడి ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. అనంతరం పట్టణ సబ్ డివిజన్ అధికారి బాలసుబ్రహ్మణ్యం కు వినతి పత్రం అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

సిద్దవటం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరయ్యగారిపల్లెకు చెందిన చాపాటి నాగమ్మకు రాష్ట్ర పంచాయతిరాజ్ చాంబర్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య మంగళవారం సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన చాపాటి వెంకటసుబ్బారెడ్డి మరణించడం తో ఆయన వైద్యం కోసం అయిన ఖర్చులకు గాను సీఎం సహాయ నిధి నుంచి రూ. 61,572 మంజూరయ్యాయన్నారు.

ఉపాధి పనులా.. ష్..!

● కూలీలకు అందని బిల్లులు ● పనులున్నా.. ఆసక్తి చూపని కూలీలు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ పనులు మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కు అన్న చందాన సాగుతున్నాయి. వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో కూలీలు ఉపాధి హామీ పనులపై అనాసక్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలో 7,799 జాబ్ కార్డులు ఉండగా, 14,034 మంది కూలీలు ఉన్నారు. 2024లో 2,05,559 మంది పని చేశారు. ప్రస్తుతం యాక్టివ్ జాబ్ కార్డులు 6,214 ఉండగా ఇందులో 10,636 మంది పని చేశారు. పని చేసిన కుటుంబాలు 4,493, ప్రభుత్వం రూ.5.34 కోట్లతో వివిధ గ్రామాల్లో రోడ్లు, సచివాలయాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.3.38 కోట్లు ఖర్చు చేశారు. ఇక మండలంలో ఉపాధిహామీ ద్వారా వివిధ గ్రామాల్లో ఫారంపాండ్‌లు 67, రైతుల పొలాల్లో బౌండరీ ట్రెంచ్‌లు 111, పండ్లతోటలు 179 మంది రైతులకు గానూ 470 ఎకరాల్లో పండ్ల తోటలు ఏర్పాటు చేశారు. కాలువల్లో పూడిక తీత 26 కాలువ పనులు చేపట్టారు. 2023-24 గృహనిర్మాణలకు 407 ఉపాధిహామీ ద్వారా రూ.87.15 లక్షలు బిల్లులను పెట్టారు. ఇక 574 జాబ్‌కార్డుకు 100రోజులు పని పూర్తి కాగా, ప్రస్తుతం 1163 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇక మండలంలో 67 ఫారంపాండ్లకు సంబంధించి రూ. 7.19 లక్షలు, 111 బౌండరీ ట్రెంచ్‌లకు రూ. 41.26 లక్షలు, 179 మంది రైతులు 470 ఎకరాల్లో పండ్లతోటలకు గాను రూ. 114.79 లక్షలు, 26 కాలువల్లో పూడిక తీత పనులకు రూ. 23.57 లక్షలు బకాయిలున్నట్లు ఉపాధి సిబ్బంది సమాచారం అందించారు.

రైతు పనుల పైనే ఆసక్తి..

గతంలో ఉపాధి పనులకు పెద్ద ఎత్తున కూలీలు హాజరయ్యేవారు. ప్రస్తుతం వారంతా వ్యవసాయ పనులకే ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ పనులకు వెళితే డబ్బులు ఎప్పటికప్పుడు చేతికి అందుతాయని భావిస్తున్నారు. ఉపాధి హామీ పనులకు వెళితే ఆ సొమ్ము ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి అందుకే వ్యవసాయ పనులకు వెళుతున్నట్లు ఉపాధి కూలీలు ఖరాఖండిగా చెబుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎక్కువ మంది కూలీలు పని చేసేలా చూడాలని, ప్రతి ఒక్కరికి పనులను కల్పించాలని ప్రభుత్వం అంటున్నా.. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదు.



రంగసముద్రం చెరువు పక్కన నీటి కుంట పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)



రాపూరివాండ్లపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు

అవగాహన కల్పించినా ప్రయోజనం శూన్యం...

ఉపాధి పనులపై ఎప్పటికప్పుడు కూలీలకు అవగాహన కల్పించినా ప్రయోజనం లేకుండా పోతోందని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం కనీస కూలి 307 రూపాయలు ఉన్నా కూలీలు మాత్రం చొరవ చూపడం లేదు. ఉన్నతాధికారులు ఓ వైపు కింది స్థాయి సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి చేస్తుండగా, వారు గ్రామాల్లో ఎన్ని సదస్సులు పెట్టినా కూలీలు మాత్రం ససేమిరా అంటున్నారు. గతంలో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండడం, కూలీల అవసరాలకు డబ్బులు సమకూరకుండా పోవడం నిరాసక్తతకు కారణంగా చెబుతున్నారు

వేధిస్తున్న సిబ్బంది కొరత

మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా, అన్ని ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నప్పుడు ఉపాధిహామీ పనులకు కూలీలు సక్రమంగా హాజరయ్యే వారు. ప్రస్తుతం ఏడు పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లు అవసరం కాగా , ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇక అభియోగాల నేపథ్యంలో ఏపీవో తిరుపాలప్పను పక్కన పెట్టారు. ఆయన స్థానంలో జేఈగా ఉన్న సుధాకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సిబ్బంది కొరత ఓ వైపు, కూలీలు పనులకు రాకుండా పోవడంతో అధికారులకు తిప్పలు తప్పడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి బకాయిలు చెల్లించడంతోపాటు చాలినంత మంది సిబ్బందిని నియమిస్తే కూలీల శాతం పెరిగే అవకాశం ఉంది.

నేడు మినీ ఉద్యోగ మేళా

రాయచోటిటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉదయం 9.30 గంటలకు మినీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప నగరంలోని షిర్డీసాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ కంపెనీలో ట్రైనీ క్వాలిటీ ఎగ్జిక్యూటివ్, ట్రైనీ సూపర్‌వైజర్, హెచ్‌ఆర్ ట్రైనీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మొత్తం ఖాళీలు 52 ఉండగా వాటిలో ట్రైనీ క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 20 ఉన్నాయని, ఆ పోస్టు కోసం బీఎస్సీ ఎంపీసీ చదివి ఉండాలని, సైట్‌కు వెళ్లి క్వాలిటీ టెస్టింగ్ చేయాల్సి వస్తుందని, జీతం రూ.15 వేలతో పాటు టీఏడీఏలు ఉంటాయని తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్ పోస్టులు 30 ఉన్నాయని, ఆ పోస్టులకు ఏదైనా డిగ్రీ చదివి ఉండాలని జీతం రూ.15 వేలతో పాటు టీఏ, డీఏలు ఉంటాయని వివరించారు. ట్రైనీ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 2 ఉండగా, జీతం రూ.18 వేలు ఉంటుందని, జిల్లా పరిధిలోని నిరుద్యోగులు రెస్యూమ్, ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో బుధవారం ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు. ఉద్యోగంలో చేరే వారు 5 ఏళ్లకు బాండ్ ఇవ్వాల్సి ఉంటుందని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

చెత్తసేకరణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

● మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు



పీలేరులో చెత్త సేకరణలో పాల్గొన్న డీఎల్‌పీఓ

పీలేరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు హెచ్చరించారు. మంగళ వారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి పంచాయతీ కార్యాలయం సహా పట్టణంలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా శానిటేషన్‌పై ప్రత్యేక చొరవ చూపాలని, ఎటువంటి మినహాయింపులు ఉండవన్నారు. విధినిర్వహణలో కార్యదర్శులు ఆద్యంతం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. మురుగునీటి కాల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలో మురుగు నీరు రహదారులపైకి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పీలేరు పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు

● జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై



వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటి సారిగా మన రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రభుత్వ సేవలను అందు బాటులోకి తెచ్చిం దని జిల్లా పశువైద్యాధి కారి గుణశేఖర్‌పిళ్లై, ఎంపీడీవో రాధాకృష్ణన్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచా యతీ కార్యాలయం నుంచి ప్రజల చేతిలో ప్రభుత్వం.. వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన పి4 గ్రామసభలో వారు మాట్లా డుతూ మనమిత్ర 955230 0009కు వాట్సాప్ నంబరు ద్వారా అందించే 200 ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సచివా లయ సిబ్బందికి సూచించారు. నాగిరెడ్డిపల్లె, నందలూరు సచివాలయంలో ఇప్పటివరకు 100 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసేందుకు ట్రస్టులు, గ్రామ పెద్దలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాగిరెడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి బండ్ల సురేష్‌కుమార్, వెంకటరమణ, వెంకట సుబ్బయ్య, సచివాలయ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివశంకర్

రాజంపేటటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండి దానివల్ల కలిగే లాభాలను వివరించాలని విశ్రాంత ఐఏఎస్, ప్రకృతి వ్యవసాయాధికారి టి.విజయ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రబల్లెలో వీఏఏలు, వీహెచ్‌ఎల్స్‌కు మూడు రోజుల పాటు అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండానే సహజ సిద్ధమైన పద్ధతులతో సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. రసాయనాల వాడకంతో భూమిలో పోష్టిక విలువలు తగ్గిపోతాయన్నారు. దీనివల్ల మనం తీసుకునే ఆహారంలో సూక్ష్మ పోషకాలు తగ్గి అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్నారన్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో నీటిపారుదల సౌకర్యం లేని మెట్ట భూముల్లో కూడా ఏడాదికి మూడు పంటలు పండించవచ్చని వివరించారు. ఈ పద్ధతులతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల ఉప వ్యవసాయ సంచాలకులు ఏడీఏ శివశంకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు హార్టికల్చర్ సహాయకులు వెంకటరమణనాయక్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీఎస్పీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె మండలం, పోతబోలు గ్రామంలోని శ్రీవేద పాఠశాల్లో నిర్వహించిన రాష్ట్ర సబ్ జూనియర్ బాలికల పుట్‌బాల్ చాంపియన్ క్రీడల్లో డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలను స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. విజేతలకు మెమొంటోలు అందించి అభినందించారు. సబ్ జూనియర్ చాపియన్ షిప్‌లో భాగంగా 8 జోన్‌ల నుంచి 9 జట్లు పాల్గొనగా ప్రథమ స్థానం కడప, 11వ స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో అనమయ్య జిల్లాల జట్లు నిలిచారని పుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీధర్ తెలిపారు. ఇందులో ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి, దిలీప్‌కుమార్, కోచ్ హరి, పవన్, శ్రీనివాసులు, సురేష్, ఉమాదేవి, మహేంద్ర, ఇర్షాద్, అంజనప్ప, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

మున్సిపల్ కార్మికుడిపై దాడి

● నలుగురిపై కేసు నమోదు



దాడిలో గాయపడిన సుధాకర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఫిట్టర్ సుధాకర్‌పై దాడి చేసిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గాంధీపురం వాసులు రాజా, రవి, ప్రదీప్, మరికొందరితో కలిసి సోమవారం దాడి చేసి గాయపరిచారని తెలిపారు. వ్యక్తిగత కక్షలతోనే ఘర్షణ జరిగినట్లు చెప్పారు. గాయపడిన సుధాకర్‌ను మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేసి ఫిట్టర్‌పై దాడి చేసి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



గాయత్రి (ఫైల్ ఫొటో)

నిమ్మనపల్లి ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యం కావడంతో భర్త నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ గుండ్లబురుజు వాసి నరేష్ భార్య గాయత్రి(22) ఇంటి వద్ద వుంటూ కుటుంబాన్ని చూసుకునేది. అయితే తాను పెయింటింగ్ పనుల కోసం మదనపల్లి వెళ్లగా సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేశాడు. కాగా వీరికి ఇద్దరు చిన్న పిల్లలు వున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రాజధాని ప్రీమియర్ లీగ్ రన్నర్స్‌గా పీలేరు జట్టు



రన్నర్స్ ట్రోఫీతో పీలేరు ఐబీటీ విద్యార్థులు

పీలేరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో జరిగిన రాజధాని ప్రీమియర్ లీగ్ టీ 20 క్రికెట్ టోర్నీలో పీలేరుకు చెందిన ఇండియన్ బీచ్ ట్రీ(ఐబీటీ) పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. హైదరాబాదు టీ20 అసోసియేషన్ పీపీపీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎనిమిది టీమ్‌లు పాల్గొనగా ఫైనల్స్‌లో హైదరాబాదు ఏఎంసీ జట్టు చేతిలో పీలేరు జట్టు పరాజయం పాలై రన్నర్స్‌గా నిలిచినట్లు ఐబీటీ ప్రిన్సిపాల్ భార్గవి, కరస్పాండెంట్ సుదర్శన్ నాయుడు తెలిపారు.

రుణ ప్రణాళికలపై అవగాహన కల్పించాలి

వీరబల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రుణ ప్రణాళికలపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బండి సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తమ జీనోపాధికి ఎంత రుణం కావాలి, ఎప్పుడు కావాలి అను వివరాలు యాప్‌లో బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఈ వివరాలు సంబంధించిన బ్యాంక్ మేనేజర్‌కు వెళతాయ న్నారు. మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాలు సక్రమంగా పుస్త కాలతోపా సమావేశాలు సక్రమంగా నిర్వహించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు గంగార్జున, వెంకట్రమణ, లీగల్ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, స్థానిక ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు కృష్ణయ్య, సుధాకర్, గంగాధరం, నాగేంద్ర, గ్రామ సమాఖ్యల సిబ్బంది అందరూ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ బండి సత్యనారాయణ

ముగ్గురు ప్రభుత్వ ఏజీపీలకు ఉద్వాసన

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాలోని మూడు న్యాయ స్థానాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ సహాయ న్యాయవాదుల సేవలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం మంగళవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లా ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా పనిచేస్తున్న సి.పవన్ కుమార్‌రెడ్డిని ప్రభుత్వం తొలగించింది. 2023 ఆగస్టు 22న ఆయనను మూడేళ్ల పదవీ కాలంతో ప్రభుత్వ ఏజీపీగా నియమించింది. అదే విధంగా అన్నమయ్య జిల్లా నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2024 ఫిబ్రవరి 27న మూడేళ్ల కాల వ్యవధితో సమీవుల్లా ఖాన్‌ను ఏజీపీగా నియమించారు. ఇదే జిల్లాలో తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2024 ఫిబ్రవరి 27న మూడేళ్ల పదవీ కాలంతో బి.నాగమల్‌రెడ్డిని ఏజీపీగా నియమించారు. ఈ ముగ్గురి సేవలను పాలనాపరమైన సౌలభ్యత కోసం ఉపసంహరించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం పేర్కొంది. నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనల ప్రకారం తొలగిస్తున్నట్లు కూడా ప్రభుత్వం తెలిపింది. కాగా ఈ ముగ్గురికి తొలగింపు గడవు నెలరోజుల వ్యవధిలో వున్నందున ఒక నెల గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకోవలసిందిగా ఆయా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అంతేగాకుండా కేసులకు ఆటంకం కలగకుండా సమీప కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జీలుగా నియమించాలని కూడా ప్రభుత్వం సూచించింది. ఈ ముగ్గురి స్థానాల్లో కొత్త ఏజీపీల భర్తీ కోసం తగిన అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా తొందరగా సమర్పించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం మూడు వేర్వేరు ఆదేశాలు జారీ చేశారు.

బిందు సేద్యంతో అధిక దిగుబడులు

● ఐదెకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ

● జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న

తంబళ్లపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బిందు సేద్యంతో తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం ఏటిగడ్డతండాలో ఎస్టీ రైతులకు సూక్ష్మ నీటి సాగుపై నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాదికి 14000 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఐదెకరాలు లోపు పంట పొలాలున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం వంద శాతం రాయితీ, ఓసీ, బీసీ రైతులకు 90 శాతం రాయితీ, 10 ఎకరాల విస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 90 శాతం రాయితీ అందజేస్తుందన్నారు. డ్రిప్ పరికరాలు అవసరమున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ జిరాక్స్, భూమి పాసుపుస్తకం, వన్-బీతో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలియ చేశారు. ప్రభుత్వం గుర్తించిన 30 కంపెనీల పరికరాల్లో ఏ కంపెనీకి చెందినవైనా రైతులు తీసుకోవచ్చని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న పదిహేను రోజుల్లో రైతులకు పరికరాలు అందజేస్తా మన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఓ రైతు పొలంలో విక్రయానంతర సేవలు (ఏఎస్‌ఎస్) కార్యక్రమం నిర్వహించి రైతులకు- మైక్రో ఇరిగేషన్ పరికరాల నిర్వహణ, నీటి, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. మైక్రో ఇరిగేషన్ పద్ధతులు అవలంబించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులతో మంచి ఆదాయం పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఐ డీసీ హరినారాయణ, ఎంఏఓ వెన్నెల, ఎంఐ కంపెనీల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు వివరిస్తున్న జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న

మామిడి సాగులో రైతులకు అవగాహన

రామసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాప్పల్లెలో మామిడికాయ కోతనంతరం తీసుకోవాల్సిన చర్యలపై రైతు లకు అవగాహన చేపట్టారు. మదనపల్లి ఉద్యాన శాఖాధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యానశాఖ తరపున రైతులకు మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, జామ వంటి పండ్ల తోటలకు రాయితీపై మొక్కలు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు మల్చింగ్ పేపర్‌కు, పూల మొక్కలు, కూరగాయల సాగుకు ఎకరాకు రూ.8వేలు రాయితీ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎవరైనా పాలీహౌస్, షేడ్‌నెట్‌హౌస్ నిర్మించుకుంటే 50శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో కాయల కోత అనం తరం చేయాల్సిన యాజమాన్య పద్ధతులపై వివరిస్తూ కొమ్మ కత్తిరిం పులు, ముదురు చెట్ల పునరుద్దరణ, తల మార్పిడి విధానం, కొత్తగా చెట్లు నాటి రైతులు ట్రైనింగ్, ప్రూనింగ్ చేయాల్సిన పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఏఓ జాఫర్, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహన

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రంలో మంగళవారం మేరా రేశం.. మేరా అభిమాన్ పట్టురైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతయ్య, పరుషోత్తం రైతులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పట్టు రైతులకు అనేక సబ్సిడీ పథకాలను అందిస్తోందని, కేంద్ర ప్రభుత్వం అందించే పలు సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకాలపై రైతులకు ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులు పట్టు పురుగులను పెంచేలా చూడాలన్నారు. మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సిరికల్చర్(ఏడి) రామమోహన్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగార్జున, చెరువు సంఘం ఛైర్మన్ చెన్నకేశవులు, టీడీపీ నాయకులు మహబూబ్‌బాష, సాంకేతిక సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

సిద్దవటం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె కనిపించడం లేదంటూ సిద్దవటం మండలం లింగంపల్లె వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ఈ గ్రామానికి చెందిన సుభాషిణి అనే విద్యార్థిని టక్కోలి జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతోంది. ఆగస్టు 2న స్కూలుకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరా తీయగా ఉమ్మడి ఆంజనేయులు అనే వ్యక్తి ఆమెను ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడని తేలింది. ఈ మేరకు వారు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

కడప పట్టణాభివృద్ధి సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా శాంతిప్రసాద్

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో కడప పట్టణాభివృద్ధి సంస్థ తరపున కేసులను వాదించడానికి అడ్వకేటు సింగలూరి శాంతిప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కడపతో పాటు చిత్తూరు, కర్నూలు, అనంతపురం, పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థల తరపున కూడా శాంతిప్రసాద్ హైకోర్టులో న్యాయ వ్యవరాలను పర్యవేక్షించనున్నారు. మూడేళ్ళ వరకూ గానీ లేదా ఆలోగా తొలగించే వరకూగానీ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని, గతంలో వున్న నిబంధనల మేరకు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభసాటి

పీలేరురూరల్, ఆగస్ట్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుందని పీలేరు ఏడీఏ రమణ రావు తెలిపారు. మంగళవారం దొడ్డిపల్లె రైతు సేవా కేంద్రంలో ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్‌ఎఫ్) కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, అవగాహన, తాము అనుసరించాల్సిన సాంకేతికత, వ్యవసాయ విధానాల్లో మార్పులపై వివరించారు. డాక్టర్ పవన్‌కుమార్, ఎంపీడీఓ జి.శివశంకర్, పీలేరు, కేవీపల్లె మండలాల వ్యవసాయ అధికారుల సుభాషిణి, సుబ్బరామయ్య, రమాదేవి, కరుణాకర్‌రెడ్డి, అల్తాఫ్, నజీర్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

తలనీలాల వేలం రూ.5.10 లక్షలు

సిద్దవటం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజేశ్వరకోనలో సెప్టెంబరు 1 నుంచి 2026 ఆగస్టు 31వ తేది వరకు తలనీలాలు సేకరించేకునే హక్కులకు మంగళవారం ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్, దేవదాయశాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. సిద్దవటంలోని రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఈ వేలంలో కమలాపురానికి చెందిన నాగయ్య రూ.5.10 లక్షలకు హక్కులు దక్కించుకున్నారని ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. గత ఏడాది కన్నా ఈ సారి రూ.2.28 లక్షలు అదనపు ఆదాయం లభించిందని వివరించారు.

రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగేనా..!

- వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులు
- కూటమి ప్రభుత్వంలో అయినా మొదలయ్యేనా..
- ఆశగా ఎదురుచూస్తున్న గ్రామీణప్రాంత ప్రజలు


పోరుమామిళ నుంచి బాలరాజుపల్లెకు వెళ్లే రంపాడు రోడ్డు

పోరుమామిళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా.. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో దాదాపు రద్దు అయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తిరిగి అంచనాలు వేసి ప్రస్తుత రేట్ల ప్రకారం నిధులు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. నిధులు మంజూరైతే గ్రామీణ రహదారులకు మహర్దశ వస్తుందని ఆయా గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పోరుమామిళ్ల నుంచి బాలరాజుపల్లెకు వెళ్లే రంపాడు రోడ్డు. దాదాపు 70 గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి. రంపాడు నుంచి బాలరాజుపల్లె మీదుగా అటు అమగంపల్లె, ఇటు నరసాపురం, జ్యోతి క్షేత్రం వరకు ఈ రహదారి అనుసంధానంగా ఉంటుంది. దీంతో విద్యార్థులు, వ్యాపారస్తులకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారి నుంచి రెండు లైన్ల రహదారి నిర్మాణానికి (సుమారు 12 కి.మీ) రూ.32కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పటి రాజకీయ పరిసితులు, కాంట్రాక్టర్లు రోడ్డు పనులు పనిచేసేందుకు ముందుకు రాకపోవడంతో ఆ పనులు రద్దయ్యాయి. దీంతో ఈ రోడ్డు గుండా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. రోడ్డు విస్తరణ పనులు చేపడితే రైతులు తాము పండించిన పంటలను పోరుమామిళ్లకు తరలించుకునేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రంపాడు రోడ్డు నుంచి బాలయపల్లె వరకు దాదాపు ఒక కి.మీ వరకు సింగల్ రోడ్డు ఉండడంతో నివాసగృహాల ముందు చెత్త చెదారాలు నిల్వ ఉండడం, డ్రైనేజీ కాల్వలు సరిగా లేక ఈ ప్రాంతమంతా అధ్వానంగా తయారైంది. ఈరహదారి నిర్మాణానికి నిధులు మంజూరైతే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానిక ప్రజలు అంటున్నారు.

ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ సలీంను వివరణ కోరగా గత ప్రభుత్వ హయాంలో పోరుమామిళ్లలోని రంపాడు రోడ్డు నుం చి బాలరాజు పల్లె వరకు సుమారు 12 కిమీ సంబంధించి రూ.32 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పనులు మొదలు పెట్టకపోవ డంతో రద్దయ్యాయని, ప్రస్తుతం అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. తిరిగి నిధులు మంజూరైతే ఆ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

వైవీయూలో ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎంబీఏ శాఖలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌గా తిరుపతి నేషనల్ సాంస్క్రిట్ విద్యాపీఠ్ ఎంఎంసీఏ విభాగ ప్రొఫెసర్ జి.శ్రీధర్ హాజరయ్యారు. వైవీయూ ప్రొఫెసర్ ఏజీ దాము, కామర్స్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ పి.సరిత, డాక్టర్ గంగయ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల మైక్రోటీచింగ్‌ను, అకడమిక్ ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల మార్కులను పరిగణలోకి తీసుకొని ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తామని వారు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల (ఆర్ట్స్) కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ కోర్సు లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రత్యేక కేటగిరీ పత్రాల పరిశీలన ఆగస్టు 21 నుంచి 23 తేదీలలో జరుగుతుందన్నారు. కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదు ఆగస్టు 21 నుంచి 24వ తేదీ వరకు, వెబ్ ఆప్షన్ల మార్పునకు ఆగస్టు 25 వరకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థుల కోసం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. సీట్లను ఆగస్టు 27వ తేదీకి కేటాయిస్తారని, తరగతులు ఆగస్టు 28 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

క్యాన్సర్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్ ఆగ స్టు 5,(ఆంధ్రజ్యోతి) ఎన్‌సీడీ-4.0 సర్వేలో ఉన్న క్యాన్సర్లపై వైద్య సిబ్బందికి మెరుగైన శిక్షణ, అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో ఎన్‌సీడీ-4.0 సర్వేలో గుర్తించిన సర్వేలపై సంబంధిత వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన గైనకాలజిస్టులు, డెంటల్ వైద్యులతో పాటు ఇతర వైద్య సిబ్బంది తాము పనిచేస్తున్న కేంద్రాలలో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలకు తదుపరి శిక్షణలు ఇవ్వాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసరు డాక్టర్ రమేష్, డాక్టర్ జీవన్‌ప్రియల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కడప, అన్నమయ్య జిల్లాలోని సెకండరీ హెల్త్ సెక్టార్‌లో పనిచేసే గైనికాలజిస్టులు, డెంటల్ వైద్యులు, రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రామాపరం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనేరు క్రాస్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో 2025-26 సంవత్సరానికి మిగిలిన 120 ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పులి రామకృష్ణ తెలిపారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు ఎస్సీ, ఎస్టీ, బీసీ విభాగానికి చెందిన బాలురకు 120 సీట్లు, 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆగస్టు 8వ తేదీ లోపల ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, చరవాణి సంఖ్యతో నేరుగా కళాశాలకు వచ్చి సంప్రదించాలని కోరారు.


ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టుకున్న పాము, పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రేగిన దృశ్యం

ట్రాన్స్‌ఫార్మర్‌కు పాము చుట్టుకొని విద్యుత్ అంతరాయం

కొండాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నక్కాతోట సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు పాము చుట్టుకోవడంతో మెయిన్‌లైన్ తీగలకు షార్ట్ సర్క్యూట్ జరిగింది. అలాగే కొండాపురం సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చేలరేగాయి.. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు ఏఈ వీరారెడ్డి తెలిపారు. మంగపట్నం ఫీడర్‌తో పాటు కొండాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఏడుగంటల దాకా, కొండాపురం టౌన్ పరిధిలో కొంతవరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నప్పటికీ ఎక్కువ మొత్తంలో లైన్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయందని తెలిపారు. పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రావడంతో కడప నుంచి టెక్నికల్ సిబ్బంది వచ్చి మరమ్మత్తులు చేశారని, దీంతో ఆలస్యం అయిందన్నారు. మంగపట్నం ఫీడర్‌లో దాదాపు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని తెలిపారు.

యువకుడిపై దాడి కేసులో నలుగురు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడిపై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తాహిర్‌హుసేన్ తెలిపారు. రవీంద్రనగర్ గుర్రాలగడ్డకు వెళ్లే బుగ్గవంక దారి సమీపంలో ఈనెల 3న చాంద్‌బాషా అనే యువకుడిపై ఇస్మా యిల్ మరో ముగ్గురు కలిసి కత్తితో దాడి చేశారు. గాయపడ్డ చాంద్‌బాషా రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనలో నిందితులైన ఇస్మా యిల్‌తో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని.. మైనర్లను ప్రభుత్వ బాలుర గృహానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాజుపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టంగుటూరు బీసీ కాలనీకి చెందిన మాబుషరీఫ్ (26) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మాబుషరీఫ్ తల్లి పొలానికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇతని అత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ... వ్యక్తికి గాయాలు

పులివెందుల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉలిమెల్ల రింగురోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో సతీష్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం 1.40గంటల ప్రాంతంలో జగనన్న హౌసింగ్ లేఅవుట్ రోడ్డు నుంచి సతీష్‌కుమార్‌రెడ్డి వస్తూ.. రోడ్డు దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో సతీష్‌కుమార్‌రెడ్డి తలకు, కాళ్లకు రక్తగాయాలయ్యాయి. ఇతను యూసీఐఎల్‌లో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

లింగాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుణకనపల్లె గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గుణకనపల్లె గ్రామానికి చెందిన లోమడ శ్రీనివాసులు బెల్టుషాపులో మద్యం అమ్ముతుండడతో దాడి చేసి.. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కులుకు భజన కళాకారుడు ఆకస్మిక మృతి


పుల్లయ్య (ఫైల్)

కలసపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హ్చద యపేటకు చెందిన కులుకు భజన కళాకారుడు, రాష్ట్ర హంస అవార్డు గ్రహీత సగిలి పుల్లయ్య అకస్మిక మృతి చెందారు. సోమవారం రాత్రి ప్రొద్దుటూరు ప్రాంతంలోని ఓ గ్రామంలో జరిగిన కోలాటం కార్యక్రమంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాగా, పుల్లయ్య ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో తన కులుకు భజనతో అకట్టుకొని అనేక అవార్డులు అందుకున్నారు. పలువురుకి తన విద్య నేర్పి భజన గురువులుగా తయారు చేసి ఉపాధి కల్పించారు. ఆయన మృతిని తోటి కళాకారులు, శిష్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆయన మృతదేహాన్ని టీడీపీ, వైసీపీ నాయకులతో పాటు వివిధ చర్చిల ఫాదర్‌లు, కళాకారులు, భారీగా ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు.

పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ కీలకం


కొక్కిరాయపల్లెలో ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు చూడామణిరెడ్డి, దివాకర్‌రెడ్డి

చెన్నూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ కీలకమని కేంద్ర పరిశీలకుల బృందం సభ్యులు చూడామణిరెడ్డి, దివాకర్‌రెడ్డిలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మండలానికి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు మంగళవారం కొక్కిరాయపల్లె గ్రామంలో వివిధ రకాల అభివృద్ధి పనులు పరిశీలించి.. స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పంటకాల్వల్లో పూడికతీత, గోకులం షెడ్లు, రోడ్లను పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ పనులు ఎలా జరుగుతున్నాయి.. ఎంత మంది కూలీలు వస్తున్నారు.. రోజూ ఎంత కూలి పడుతోందని ఆరా తీశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రతి పంచాయతీలో ఏటా వచ్చే నిధులతో ఎలాంటి పనులు చేపడుతున్నారు.. ఆ పనులతో ఆయా గ్రామాల ప్రజలకు కలిగే ప్రయో జనాలు, ప్రతి నెలా పింఛను సక్రమంగా అందుతుందా, లేదా పింఛనుకు దరఖాస్తు చేసుకుంటే ఎన్ని రోజులకు వస్తుంది.. తదితర వాటి గురించి ప్రజలను అడిగి తెలుసుకుఆన్నరు. కేంద్రం అందించే ప్రతి సంక్షేమ పథకం ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో అందేలా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో గంగాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీడీలు సుబ్బారెడ్డి, రామలింగారెడ్డి, ఆనంద్, రఘు, పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, కార్యదర్శి రేణుకాదేవి పాల్గొన్నారు.

జిల్లాలో ఎనాక్స్ ప్రాజెక్ట్ అమలుకు అవగాహన ఒప్పందం


ఎనాక్స్ ప్రాజెక్ట్‌పై ఒప్పందం కుదుర్చుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 5,(ఆంధ్రజ్యోతి): సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహార-వ్యవసాయ కన్వర్జెన్స్ (ఎనాక్స్) అనే కార్యక్రమాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసేందుకు జిల్లా పరిపాలనా యంత్రాంగం, ఇండియన్ స్కూలు ఆఫ్ బిజినెస్, హైదరాబాద్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి డిజిటల్ సైన్ చేసిన అవగాహన ఒప్పంద పత్రాన్ని హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, టీబీపీపీ అసోషియేట్ ప్రొఫెసర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్విని ఛాత్రేకి సంబంధిత ప్రాజెక్ట్ ప్రతినిధి అధికారుల సమక్షంలో సమర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ఐఎస్‌బీ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సమకూర్చే నిధులతో సాంకేతిక మద్దతు ద్వారా పోషకాలు అధికంగా ఉండే ఆహారపదార్థాల లభ్యత, పౌష్టిక సామర్థ్యాన్ని మెరుగు పరచడానికి సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహారం-వ్యవసాయ కన్వర్జెన్స్ అనే పైలెట్ ప్రాజెక్ట్ జిల్లాలో అమలు కానుందన్నారు. అంగన్వాడీలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో, గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పోషణ విలువలతో కూడిన ఆహారం, పంటల ఉత్పత్తిని పెంపొందించే దిశగా జిల్లాలో ఆయా శాఖలతో సమీక్షించి క్షేత్రస్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం అవుతారన్నారు. ఎనాక్స్‌లో రాపిడ్ రెస్పాన్స్ రీసెర్చ్ (ఆర్‌ఆర్‌ఆర్) అనే ప్రత్యేక విభాగం ఉందని, ఇది జిల్లా స్థాయిలో వ్యవసాయ-పోషకాహార కలయికను తెలియజేయడానికి, ఆయా రంగాలకు మద్దతు ఇవ్వడానికి, సకాలంలో డిమాండ్ ఆధారిత స్థల ఆధారిత పరిశోధనలను చేయడానికి రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎనాక్స్ ప్రతినిధులు వైష్ణవి, స్మృతి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరకు మార్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యాన తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

అనధికార లేఔట్‌ల నియంత్రణకు అవకాశం

కడప రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఔట్‌ల నియంత్రణకు అవకాశం కల్పించిందని డీపీవో రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రయ ఒప్పందం, హక్కు పత్రంలో ఉన్న అనధికార లేఔట్ లేదా ప్లాట్‌కు 90 రోజుల్లో వ్యక్తిగతంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందన్నారు. కొత్త దరఖాస్తుల కోసం ఆగస్టు 4 నుంచి ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. 50 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు తగ్గింపు ఉంటుందన్నారు. 4000 చదరపు మీటర్ల లోపు విభజన లేకుండా ఉన్న ప్లాట్‌కు కూడా అర్హత ఉంటుందన్నారు. ఇప్పటికే ఐపీఎల్‌పీ ఆమోదించిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 9849966639 నెంబర్‌లో కుడా ఏపీవోను సంప్రదించాలన్నారు.

డిగ్రీ పరీక్షల తనిఖీ

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైవీయూ కేంద్రంగా జిల్లాలోని అన్ని డిగ్రీకళాశాలల విద్యార్థులకు సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో కలిసి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. వసతుల గురించి ఆరా తీశారు. ఈ పరీక్షలకు 278 మంది హాజరు కాగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, తదితరులు ఉన్నారు.

బ్రహ్మంగారి మాస కల్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధం


మాస కల్యాణ మహోత్సవానికి సిద్ధమైన కల్యాణ మండపం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత గోవిందమాంబల మాస కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మందిరాన్ని అలంకరణ చేసి సిద్ధం చేశామన్నారు. కల్యాణ మహోత్సవ ఉభయదాతలు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు హాజరవుతారన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి


సురేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి


మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అంకిరెడ్డి సురేష్‌రెడ్డి (సైదాపురం చంటి), అతని అనుచరుడు అమరేశ్వర్‌రెడ్డిలపై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దాడి చేశారు. పులివెందుల పట్టణంలోని శ్రీకర్ కళ్యాణమండపం సమీపంలో ఈ దాడి జరిగింది. వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వీరిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలను భయబ్రాంతులకు గురిచేసేందుకే మా పార్టీ నాయకుడిపై దాడి చేశారన్నారు. ఏడాది కాలంగా ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా ఓట్లకు వెళితే ఓడిపోతామని హత్యా రాజకీయాలకు తెర లేపారన్నారు. హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాష, అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి మరి కొందరు కర్రలతో దాడి చేశారన్నారు. కాగా, ఈ దాడికి సంబంధించి బీటెక్ రవి ఒక వీడియో విడుదల చేసి మాట్లాడారు. సురేష్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన అవినాశ్‌రెడ్డి మా పార్టీ నాయకుడని సంబోధించడం సరైంది కాదన్నారు. సురేష్‌రెడ్డి జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారన్నారు. అతన్ని తమ పార్టీ నాయకుడిగా ఎంపీ ఎలా ప్రకటిస్తా రన్నారు. సురేష్‌రెడ్డిపై దాడి చేసి జగన్ మామ అయిన ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రికి తరలించారన్నారు. దాడి చేస్తే ప్రభుత్వ ఆసు పత్రికి తరలించాలి తప్ప ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి నుంచి వచ్చి కుట్లు వేయడం, తుడవడం లాంటివి చేశారన్నారు. ఇపుడు సురేష్‌రెడ్డికి ఏదైనా ఇంజక్షన్ గాని చేసి ప్రాణహాని కలిగిస్తే ఎన్నికలు ఆగిపోతాయనే దురుద్దేశం దాగి ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. వెంటనే పోలీసులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించాలన్నారు.

రీసర్వే సమస్యలపై నిర్లక్ష్యం తగదు

● తప్పిదాలతో పథకాలు కోల్పోయిన అర్హులు : జయచంద్రారెడ్డి



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూముల రీసర్వే తప్పిదాలతో చాలా మంది అర్హులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. ఇటీవల రైతులు అధిక సంఖ్యలో రీసర్వే సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. రైతులు, భూముల రీసర్వే తప్పిదాలను తహసీల్దార్ ప్రదీప్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. ఫలితంగా చాలా మంది తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ సహాయం పొందలేక పోయారన్నారు. సెంటు భూమి లేని వారికి ఎకరాలకు ఎకరాలు భూమి ఎలా వచ్చింది. రీసర్వే సమస్యలు పరిష్కరించి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. మండలంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో ఆన్‌లైన్ రికార్డుల్లో భూమి లేని వారికి కూడా భూమి ఉన్నట్లు నమోదవడంతో చాలా మంది పథకాలు కోల్పోయారన్నారు. ఈ విషయాలను రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా రీసర్వే తప్పిదాలను సరిచేయాలని సూచించారు. బ్రిటిష్ కాలం నాటి బంగ్లా పడిపోవడంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా కొత్త భవనం నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేశారన్నారు. బంగ్లా హద్దులు చూపమని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. కదిరినాధునికోట చెరువులో మట్టి ఎత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా మట్టి తవ్వితే చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ప్రదీప్, డీటీ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు కన్నీటి వీడ్కోలు

● నివాళులర్పించిన ఎమ్మెల్యే నల్లారి



హుమయూన్, షాజహాన్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన పీలేరు మాజీ సర్పంచ్ ఎ.ఎస్.హుమయూన్, అతని సోదరుడు షాజహాన్‌కు మంగళవారం పీలేరు పట్టణ ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. మంగళవారం మధ్యాహ్నం పీలేరు కట్టుకాల్వ వీధిలోని ముస్లిం శ్మశాన వాటికలో వారి అంత్యక్రియలు జరిగాయి. తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వారిద్దరూ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తిరుత్తణిలో పోస్టుమార్టం అయిన సోమవారం రాత్రికి పీలేరుకు మృతదేహాలను తీసుకురావడంతో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి నివాళులర్పించి హుమయూన్ సోదరులకు ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన హుమయూన్ కుమారుడు హబీబ్ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఎటువంటి సాయం కావాలన్నా తనను సంప్రదించాలని తెలిపారు. సోదరుల భౌతిక కాయాలను సందర్శించేందుకు పీలేరు నియోజకవర్గం సహా మదనపల్లె, కదిరి, హిందూపురం, బెంగళూరు, హైదరాబాదు పట్టణాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పారిశుధ్య కార్మికులు పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, పీలేరు మాజీ జడ్పీటీసీ మల్లెల రెడ్డిబాషా, పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి, తదితరులు నివాళులర్పించారు.

మిట్స్ విద్యార్థులకు ఐఎస్‌టీఈ అవార్డులు



ప్రశంశా పత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మిట్స్ యూనివర్సిటీ, మిట్స్ విద్యార్థులకు ఐఎస్‌టీఈ అవార్డులు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. ఏపీ ఐఎస్‌టీఈ విద్యార్థుల నైపుణ్యం, సాంకేతిక పరిశోధనల పరిధిలోకి తీసుకుని అవార్డులు అందజేశారన్నారు. కాగా కళాశాలతో పాటుగా ఈఈఈ విభాగంలో భార్గవి, సీఎస్ఈ విభాగంలో కార్తీక్‌కు ఈ అవార్డులు దక్కాయన్నారు. 14న విజయవాడలో ఈ అవార్డులను అందుకోనున్నట్లు తెలిపారు. కాగా అవార్డులకు ఎంపికైన ప్రతులను ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎస్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, తదితరులు అభినందించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలకు భారమే

● సీపీఎం, ప్రజాసంఘాల నిరసన

మదనపల్లె టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలకు అధిక భారం పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట సీపీఎం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలన్నారు. వైసీపీ, కూటమి ప్రభుత్వాలు ఆదాని సంస్థకు అమ్ముడుపోయాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు హరీంద్రశర్మ, నాగరాజు, నరసింహ, ఏఐటీయూసీ నేతలు సాంబశివ, ముబారక్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని ఆపాలంటూ నిరసన

బి.కొత్తకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసనలకు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం బి.కొత్తకోట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏఐటీయూసీ నేతలు నిరసన చేపట్టారు. నియోజకవర్గ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా నేత సలీంబాష మాట్లాడారు. తక్షణం ప్రభుత్వం నిర్ణయాలను ఉపసంహరించుకుని పాతవిధానాన్నే అములు చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాలక్రిష్ణ, గఫూర్, షఫీ, నారాయణ, శంకర పాల్గొన్నారు.



బి.కొత్తకోట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

'మనమిత్ర'తో నేరుగా సర్టిఫికెట్లు

సేవలు సద్వినియోగం చేసుకోండి ● వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీలు



మనమిత్ర సేవలపై పెద్దమండ్యంలో ర్యాలీ చేస్తున్న అధికారులు - మేడికుర్తిలో చేపట్టిన మానవహారం

పెద్దమండ్యం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌తో ఏ పని కావాలన్నా నేరుగా పూర్తి చేసుకోవచ్చని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు పిలుపు నిచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనమిత్ర యాప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చిన ఆయన మాట్లాడుతూ మనమిత్ర సేవల వినియోగంపై అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రెండు వందల రకాల ప్రభుత్వ సేవలకు ప్రజలు ఇంటి నుంచే 9552300009 వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీఎం సురేంద్రారెడ్డి, కార్యదర్శి సుబ్రమణ్యం, సీసీలు, సంఘమిత్రలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ధృవ పత్రాలు నేరుగా పొందవచ్చు

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచే అన్ని రకాల ధృవపత్రాలను నేరుగా పొందవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ రియాజుద్దీన్, కలికిరి కార్యదర్శి పి.అశోక్ అన్నారు. మండలంలో వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీలు చేపట్టారు. కలికిరి పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం 200 సర్వీసులు అందుబాటులో వున్నాయని చెప్పారు. అన్నదాత సుఖీభవ నిధులు జమయ్యాయా లేదా అనే విషయం క్షణాల్లో తెలుసుకోవచ్చని, లేదంటే కారణాన్ని కూడా అందులోనే చూపిస్తుందని చెప్పారు. దైనందిన జీవనానికి అనేక సేవలు అందుబాటులో వున్నాయన్నారు. మేడికుర్తిలో టీడీపీ నేతలు విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేష్‌కుమార్ రెడ్డి, బోర్‌వెల్స్ చంద్ర, కలికిరిలో ఎంపీడీఓ రియా జుద్దీన్, అశోక్, యోగేష్ రెడ్డి పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు అందించే పలు సేవలను మరింత సులభతరం చేసేందుకు ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన ర్యాలీ చేపడుతోంది. సర్పంచ్ తమక శంకర, పంచాయతీ కార్యదర్శి విద్యావతి, వీఆర్వో లలితమ్మ, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సూరి, గ్రామకమిటీ అధ్యక్షుడు టైలర్ రామాంజులు, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరించాలి



సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలా దేవికి వినతి పత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నేతలు విన్నవించారు. మంగళవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి ఎస్.వంశీధర్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోర్కెల దినం సందర్భంగా జర్నలిస్టులు సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవికి వినతి పత్రం అందజేశారు. ఏడాదిగా జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు మంజూరు చేయలేదని, జర్నలిస్టుల హెల్త్ కార్డ్ లోటుపాట్లను సవరించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే నేతలు జె. శ్రీనివాసులు, అక్కులప్ప, షామీర్, శివారెడ్డి, శ్రీధర్, రాజు, శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నిమ్మనపల్లి ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు పరిసరాలు శుభ్రంగా వుంచుకుంటే రోగాలు దరిచేరవని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం పంచాయతీలో చెత్తసేకరణను పరిశీలించారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. బస్టాండులో ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయని ప్లాస్టిక్ అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీని వెంటనే ప్రకటించాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులతో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ కమిటీని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, మధుసూదన్ డిమాండ్ చేశారు. ములకలచెరువు, సోంపల్లె, దేవళచెరువు, బురకాయలకోట తదితర జడ్పీ హైస్కూళ్లను సందర్శించిన వారు మాట్లాడుతూ 2023 జూలై నుంచి 12వ పీఆర్‌సీ అమలు కావాల్సి ఉండగా ఆలస్యమైనందున ప్రస్తుత ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు మధ్యంతర భృతి కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అమరనాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో సైబర్‌మోసం

ఫిర్యాదు చేసినా లైట్ తీసుకున్న సిబ్బంది

బి.కొత్తకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంకు బ్రాంచిలో సైబర్‌మోసాలు వెలుగు చూస్తున్నాయి. పెద్దమొత్తంలో నగదు పోగొట్టుకున్న బాధితులు లబోదిబోమంటూ బ్యాంకు సిబ్బంది వద్దకు పరిగెడితే వారు దాన్ని లైట్ తీసుకుని కస్టమర్‌కేర్‌కు పంపుతాం అని తాపీగా సమాధానం ఇస్తుండడం బాధితులకు మరింత బాధను కలిగిస్తోంది. బి.కొత్తకోట యూనియన్ బ్యాంకులో పీటీఎం మండలం రంగసముద్రం వాసి బొక్కసం నరేష్ ఖాతా నుంచి ఇటీవల ఏకంగా రూ.71648 మాయమయ్యాయి. బాధితుడు నరేష్ ప్రమేయం లేకుండా అంతా జరిగిపోయింది. అదే గ్రామానికి చెందిన నాగార్జున ఖాతా నుంచి కూడా రూ.1,00,000 వరకు మాయం అయ్యాయని నరేష్ తెలిపాడు. అప్పుడు నాగార్జున, ఇప్పుడు నరేష్ ఫిర్యాదు చేసినా సంతృప్తి కరమైన సమాధానం రాలేదని వీరు వాపోతున్నారు. వీరి ఫిర్యాదును స్వీకరించినట్లు మెసేజ్ మాత్రమే వచ్చింది. సంబంధిత అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వీరు కోరుతున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



నగిరిమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రసవంలో పుట్టబోయే బిడ్డ విషయంలో ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా చర్యలు తప్పవని నగిరిమడుగు, చింతపర్తి వైద్యాధికారులు జులేఖాబేగం, నయీం హెచ్చరించారు. మంగళవారం ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఆశా డే కార్యక్రమంలో భాగంగా లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994పై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, సీహెచ్‌వో అరుణ, వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీబీ పట్ల శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని, టీబీ రహిత భారత్‌కు సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాష పిలుపునిచ్చారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగామ్ అన్నమయ్య జిల్లాలో జోన్ 2 నుంచి ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, జిల్లా టీబీ ప్రోగామ్ కో-ఆర్డినేటర్లు ప్రవీణ్, టీబీ విభాగం ప్రభాకర్, సిబ్బంది శాంతి, వనజ, సుశీల, తరుణ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నేత రెడ్డిరమేష్‌బాబు

పీలేరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి. రెడ్డిరమేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలపై మంత్రి లోకేష్‌ను కలిసి నివేదించామన్నారు. ఎంఈఓ, జేఎల్ ప్రమోషన్లపై రెండు వర్గాలతో చర్చించి ఉమ్మడి సీనియారిటీని పునరుద్దరించాలని, ఇందులో న్యాయపరమైన అడ్డంకులు తొలగించి స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. 2003 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవల బదిలీల్లో పలువురికి జీతాలు ఇంకా ఇవ్వలేదని, వారికి సప్లమెంటరీ బిల్లుల ద్వారా జీతాలు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్లస్‌టూ స్కూళ్ల బలోపేతం కోసం అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు ఆయన చెప్పారు.

బీజేపీ అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్

తంబళ్లపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రాయచోటి పర్యటనను విజయవంతం చేద్దామని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ పిలుపునిచ్చారు. తంబళ్లపల్లెలో బీజేపీ మండల నేతలు, కార్యకర్తలతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతమే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టారన్నారు. 10న రాయచోటికి వస్తున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ మండలాధ్యక్షుడు రమణ, మాజీ మండలాధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకుందాం

మదనపల్లె టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఐక్యతతో పరిష్కరించుకుందామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరసనలు తెలిపితే సంఘాల నేతలపై అక్రమ కేసులు పెట్టేందుకు యత్నించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం బాధకరమన్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల బకాయిల చెల్లింపుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీజీఏ సభ్యులు ఉమాశంకర్, యుగంధర్, దర్మయ్య, కిరణ్, పద్మజ, సంధ్యారాణి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను కాపాడేందుకే ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్

మదనపల్లె అర్బన్/రామసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాల నుంచి కాపాడేందుకు ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ చేపడుతున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మంగళవారం మీడియాతో డీజీపీ ఆదేశాల మేరకు 10వ తేదీ నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్, 11 నుంచి 17 వరకు అధిక వేగం, 18నుంచి 24వరకు హెల్మెట్ లేని ప్రయాణంపై డ్రైవ్‌లు నిర్వహిస్తామని 25 నుంచి 31 వరకు బ్లాక్ స్పాట్ల డ్రైవ్ చేపడుతున్నట్లు రామసముద్రం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

కూటమి ప్రభుత్వం సల్లగుండాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వృద్దులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ల సొమ్ము పెంచిన కూటమి ప్రభుత్వం సల్లగుండాలని రామారావు కాలనీ ప్రజలు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాష ఆధ్వర్యంలో పట్టణంలోని రామారావు కాలనీ నాలుగో వార్డులో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

చిన్నారులకు తల్లిపాలు ఓ దివ్య ఔషధం

బి.కొత్తకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు తల్లిపాలను మించిన పౌష్టికాహారం, దివ్య ఔషదమని బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యమ్మ పేర్కొన్నారు. బడికాయలపల్లె అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలవారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ తల్లులు, గర్భిణులతో సమావేశం నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వం తల్లీపిల్లల ఆరోగ్యం, సంక్షేమం కోసం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అంగన్వాడీ కేంద్రాల నుంచి తీసుకుని, ఆయా అంగన్వాడీ, ఆశా కార్యకర్తల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. సూపర్‌వైజర్ జయరాణి, కార్యకర్తలు కుమారి, రమణమ్మ పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు మొదటి వ్యాక్సిన్

తంబళ్లపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లి పాలే మొదటి వ్యాక్సిన్ అని సీడీపీఓ సుజాత అన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు చంద్రకాంత, రమణమ్మ, నాగలక్ష్మీ, నౌజియా బేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లిం ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శిగా ముబారక్

నిమ్మనపల్లి ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ముస్లిం ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి నిమ్మనపల్లి వాసి ముబారక్‌ను నియమితులయ్యారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ముస్లింలకు ఎలాంటి సమస్యలున్నా సహాయసహకాలు అందిస్తామని, రాష్ట్ర ముస్లిం ఐక్యవేదిక కోసం తన వంతు పాటుపడతాని తెలిపారు.

మత్తుకు బానిసలు కావొద్దు

గుర్రంకొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయి, బాల్యవివాహాలు, ర్యాగింగ్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ రఘురాం పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండి చదువుకోవాలన్నారు. గంజాయి అమ్మకాలపై సమాచారం తెలిస్తే విద్యార్థులు పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు జమీర్, సిబ్బంది అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

64.2 మి.మీ వర్షం

వాల్మీకిపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో 64.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సోమవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షం పట్టణ ప్రజలకు సమీప ప్రాంతాల రైతులకు ఉపశమనం, కాసింత ఊరటనిచ్చింది. 15 రోజులుగా వర్షాభావంతో విలవిల్లాడుతున్న వాల్మీకిపురంలో ఒక్కసారిగా కుండపోత వర్షం కురవడంతో వాగులు, కుంటలు నీటితో కళకళలాడుతూ కనిపించాయి.

నేడు మాజీ సీఎం రాక

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నేత నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి బుధవారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. కిరణ్‌కుమార్ రెడ్డి హైదరాబాదు నుంచి మంగళవారం బెంగుళూరు చేరుకున్నారని, రాత్రికి అక్కడే బస చేసి బుధవారం ఉదయం 8.30 గంటలకు బెంగుళూరు నుంచి బయలుదేరి 10.45కు మదనపల్లె రామతులశమ్మ కల్యాణ మండపం చేరుకుంటారు. మధ్యాహ్నం 12.45కు కలికిరి చేరుకుంటారు.

నేడు ఆస్పత్రి భవనాలు ప్రారంభం

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య కేంద్రం కొత్త భవనాలను ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రారంభించనున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్ర కుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు ఆర్‌సీ రెడ్డెప్ప రెడ్డి, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, టీడీపీ అనుబంధ విభాగాల కార్యనిర్వాహకులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ప్రజలు హాజరు కావలసిందిగా కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వాల్మీకిపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం కోసం బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి అన్నారు. టి.సాకిరేవుపల్లె గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ ద్వారా జరగనుందని మండల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

నేడు గుర్తింపు శిబిరాలు

పెద్దమండ్యం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. హైస్కూల్‌లో మధ్యాహ్నం ఈ శిబిరం జరగనున్నట్లు తెలిపారు. గుర్తింపు పొందిన వారికి ఉచితంగా పరికరాలు అందజేస్తారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం చంద్రబాబును కలిసిన హజ్ కమిటీ డైరెక్టర్



మదనపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, సీఎం చంద్రబాబును కలిశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి, ముస్లిం మైనార్టీల అభివృద్ధి విషయంలో వివిధ అంశాలతో కూడిన వినతి పత్రాన్ని సీఎంకు అందజేశారు. పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.లక్ష రాయితీ ఇవ్వడం, ఏపీ నుంచి హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు అనుకూలంగా విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేయడంపై పఠాన్ ఖాదర్‌ఖాన్, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మస్తాన్‌వలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీఓగా మస్తాన్‌వలిని నియమిస్తూ చిత్తూరు జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ నెల రోజుల శిక్షణ నిమిత్తం శ్రీకాళహస్తికి వెళ్లడంతో ఆయన స్థానంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా విధులు నిర్వహిస్తున్న మస్తాన్‌వలికి అదనపు బాధ్యతలు కేటాయించారు.